
నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 3వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


పీలేరులోని ఏపీఐఐసీ-1 లేఔట్



పీలేరులోని ఏపీఐఐసీ-2 లేఔట్

జగనన్న కాలనీల్లో

మొదలైన విచారణ!

- కదిలిన పీలేరు అధికార యంత్రాంగం
- తొమ్మిది బృందాలతో క్షేత్రపరిశీలన
- వైసీపీ నేతల గుండెల్లో గుబులు
- వెలుగు చూడనున్న అక్రమాలు

పీలేరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పీలేరులో 'తాంబూలాలు ఇచ్చేశాం...తన్నుకు చావండి' అన్న చందంగా సాగిన జగనన్న కాలనీల లెక్క తేల్చేందుకు రెవెన్యూ యంత్రాంగం నడుం బిగించింది. ఇంతకాలం తేనె తుట్టను ఎలా కదపడం అని మీనమేషాలు లెక్కించిన వారు ఎమ్మెల్యే కిశోర్ కుమార్ రెడ్డి ఆదేశాలతో జగనన్న కాలనీల్లో క్షేత్రస్థాయి విచారణ ప్రారంభించారు. అర్హత, అనర్హత ప్రామాణికాలు చూడకుండా నాయకులు కోరినన్ని మంజూరు చేసేశారు గత పాలకులు. దీంతో ఆయా కాలనీల్లో అసలైన లబ్ధిదారులు ఎవరో, అక్రమార్కులు ఎవరో, ఇంటి పట్టా ఎవరి పేరిట ఉందో, ఇల్లు నిర్మిస్తున్నది ఎవరో అటు హౌసింగ్, ఇటు రెవెన్యూ అధికారులకే తెలియని గందరగోళ పరిస్థితి నెలకొని ఉండేది. అధికారుల తాజా విచారణతో వాటన్నింటికీ స్పష్టమైన సమాధానాలు దొరుకుతాయన్న ఆశాభావం లబ్ధిదారుల్లో వ్యక్తమవుతోంది. నిరుపేదలకు స్వంతిళ్లు నిర్మించి ఇస్తామని గొప్పలు చెప్పుకుంటూ ఆ ఇళ్ల మాటున వైసీపీ నాయకులు సాగించిన అక్రమాలు కూడా బహిర్గతం అవుతాయని టీడీపీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పీలేరులో 12 వేల ఇళ్లు పంపిణీ

రెవెన్యూ రికార్డుల మేరకు పీలేరు మండలంలోని పేదలకు వైసీపీ ప్రభుత్వం హయాంలో 12 వేల ఇళ్లు మంజూరు చేసింది. ప్రధానంగా పీలేరు పట్టణంలోని పేదలకు వాటిలో 9 వేల ఇళ్లు కేటాయించారు. తిరుపతి రోడ్డులోని కంకర ఫ్యాక్టరీ, గూడరేవుపల్లె, హెరిటేజ్ ఫ్యాక్టరీ, ఆయిల్ సీడ్స్ ఫ్యాక్టరీ, ఏపీఐఐసీ భూముల్లో నాలుగు లేఔట్లు వేసి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. పెద్దఎత్తున మంజూరైన జగనన్న కాలనీల్లో వైసీపీ నేతల కారణంగా అవినీతి, అక్రమాలు కూడా పెద్దఎత్తునే జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఆయా కాలనీల్లో తమకు కావాల్సిన చోట చాలా ఫ్లాట్లు ఖాళీగా పెట్టుకుని తమకు కావాల్సిన వారికి పంచి పెట్టుకున్నారన్న ఉదంతాలు నిజం కూడా అయ్యాయి. అధికారులు వేసిన లక్కీడిప్‌లో ఇళ్లు చేజిక్కించుకున్న లబ్ధిదారులను సైతం అధికార దర్పంతో చాలామంది వైసీపీ నాయకులు నయానో భయానో భయభ్రాంతులకు గురిచేయడం నిత్యకృత్యంగా ఉండేది. పునాదులు నిర్మించుకున్న లబ్ధిదారులను సైతం బెదిరించి ఆ ఫ్లాట్లను అధికార పార్టీ నేతలు తమ హస్తగతం చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. దీంతో చాలా మంది లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయం, పోలీసుస్టేషన్ చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేయడం పరిపాటిగా ఉండేది. ఇంతకాలం వాటిని ఎలా అధిగమించాలో తెలియక మల్లగుల్లాలు పడ్డ రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పునఃపరిశీలనకు దిగారు. ఈ సందర్భంగా తహసీల్దారు భీమేశ్వరరావు మాట్లాడుతూ లబ్ధిదారులను ఎంపిక చేసినప్పుడు తమ వద్ద రిజిష్టర్‌లో నమోదు చేసుకున్నామని, తమ వద్ద ఉన్న రికార్డుల మేరకు లబ్ధిదారులకు న్యాయం చేస్తామని, మధ్యలో ఎవరైనా వాటిని ఆక్రమించుకుని ఉన్నా, ఇతర మార్గాల్లో నెంబర్లు మార్చి ఉన్నా పట్టించుకోమన్నారు. మరో మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో విచారణ పూర్తి చేస్తామన్నారు. తద్వారా జగనన్న కాలనీల్లో అనర్హుల చేతుల్లో ఉన్న ఇళ్ల స్థలాలను స్వాధీనం చేసుకుని అర్హులైన వారికి పంచి పెడతామన్నారు.

వైసీపీ నేతల గుండెల్లో గుబులు

జగనన్న కాలనీల్లో అధికారుల విచారణతో పీలేరులోని అధిక శాతం వైసీపీ నేతల గుండెల్లో గుబులు మొదలైంది. అధికారుల విచారణ సమయంలో నిర్మాణంలో ఉన్న పలు ఇళ్లు అక్రమమైనవని స్పష్టమైంది. అధికశాతం నిర్మాణాలను ఆయా విచారణ అధికారులు వెంటనే నిలిపివేశారు. ఈ విషయం వైసీపీ నాయకుల వరకు చేరడంతో వారి నెత్తిపై పిడుగు పడినట్లయింది. అధికారంలో ఉన్నప్పుడు అవినీతిలో ఆకాశమే హద్దుగా వైసీపీ నాయకులు చెలరేగిపోయారు. నాయకుల స్థాయిని బట్టి ఒక్కొక్కరు రెండు నుంచి నాలుగు ఫ్లాట్లు సొంతం చేసుకున్నారు. ఇక వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి నేతల అక్రమాలకు లెక్కే లేదు. కొంతమంది నాయకులు తమ పరిధిలోని వీఆర్వోలు, సచివాలయ సిబ్బందిని తమ ఇళ్ల వద్దకే పిలిపించుకుని తమకు కావాల్సిన ఫ్లాట్ల నెంబర్లు వేయించుకున్నారు. వాటిని అమ్ముకున్న తరువాత తహసీల్దారు కార్యాలయంలో అధికారిక సీళ్లు సైతం వేయించుకున్నారు. దీంతో రికార్డుల్లో ఉన్న లబ్ధిదారులు, క్షేత్రస్థాయిలో ఉన్న లబ్ధిదారుల పేర్లలో భారీ తేడాలు ఉన్నాయి. అవన్నీ అధికారుల విచారణలో బట్టబయలు కానున్నాయి. వైసీపీ నేతలను నమ్మి వారి వద్ద ఫ్లాట్లు కొనుగోలు చేసిన సామాన్యులు సైతం ఆందోళనకు గురవుతున్నారు.

9 బృందాలతో విచారణ

ఎమ్మెల్యే ఆదేశాలతో కాలనీల్లో అక్రమాల విచారణకు తహసీల్దారు భీమేశ్వరరావు 46 మంది గ్రామ సచివాలయ, రెవెన్యూ సిబ్బందితో 9 బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో నలుగురు సభ్యులను నియమించి వారికి ఒక్కో లేఔట్‌లో నిర్దేశించిన సంఖ్యలో ఫ్లాట్లు కేటాయించారు. దీంతో తమకు కేటాయించిన ఫ్లాట్ల వద్దకు ఆయా అధికారులు మూడు రోజుల నుంచి క్షేత్రపరిశీలన చేస్తున్నారు. విచారణ ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతను డీటీలు సుబ్రహ్మణ్యం, రెడ్డప్ప రెడ్డి, ఈవోపీఆర్ఆర్‌డీ లతీఫ్ ఖాన్, మండల సర్వేయర్ కిరణ్మయిలకు అప్పగించారు. మరో రెండు రోజుల్లో వీరు విచారణ పూర్తి చేయనున్నారు.


ఏపీఐఐసీ-2 లేఔట్‌ను పరిశీలిస్తున్న విచారణ బృందం

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సంక్షేమ పథకాల అమలు చంద్రబాబుకే సాధ్యం

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎవ్వరూ చేయని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడే అర్హత వైసీపీ నాయకులకు లేదన్నారు. ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి చేయకుండా రాష్ట్రాన్ని దివాలా తీయించిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల గురించి వైసీపీ వారు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. అవ్వా, తాతలకు ఇచ్చే పింఛన్‌తో వారు సమాజంలో గౌరవంగా బతుకుతున్నారని తెలిపారు. అలాగే డీఎస్సీలో ఎటువంటి అక్రమాలకు తావులేకుండా అర్హులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఉచిత గ్యాస్ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 45 లక్షల మంది లబ్ధి పొందుతున్నారని చెప్పారు. గతంలో చంద్రబాబు ఐటీ విప్లవం తీసుకువచ్చి హైదరాబాదును హైటెక్ సిటీగా రూపొందించి అభివృద్ధి చేశారన్నారు. వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు మానుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

బి.కొత్తకోట ఈవో మునిరాజ్‌కు మెమో

- విధి నిర్వహణలో ఉదాసీనతపై వివరణ ఇవ్వాలని ఆదేశం

బి.కొత్తకోట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : బి.కొత్తకోట ఆలయ సముదాయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మునిరాజ్‌కు అధికారులు మెమో ఇచ్చారు. దేవదాయ భూముల ఆక్రమణల విషయంలో ఉదాసీన వైఖరిపై వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. బి.కొత్తకోటలోని ఆంజనేయస్వామి, చౌడేశ్వరస్వామి, నల్ల గంగమ్మ ఆలయాల ఈవోగా విధుల్లో ఉన్న మునిరాజ్ తీవ్ర ఆరోపణలు, విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఆలయాల మాన్యం భూముల నిర్వహణలో అక్రమాలకు పాల్పడ్డారని లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లాయి. లోకాయుక్త ఆదేశాల మేరకు ఇటీవల కర్నూలు జిల్లా డిప్యూటీ కమిషనర్ రామాంజనేయులు ఇక్కడికి వచ్చి విచారణ చేశారు. కాగా బి.కొత్తకోటలో ఆక్రమిత భూముల స్వాధీనం విషయంలో ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని దేవదాయ శాఖ జిల్లా కమిషనర్ విశ్వనాథ్ రెండు రోజుల క్రితం మెమో ఇచ్చారు. దీంతో ఆదివారం పోలీసుల సహాయంతో ఆంజనేయస్వామి మాన్యం భూమిలో ఏర్పాటు చేసిన దుకాణదారులతో ఈవో మునిరాజ్ మాట్లాడారు. తక్షణమే మాన్యం భూముల నుంచి దుకాణాలను తొలగించాలని హెచ్చరించారు. ఇదే విషయమై తమకు సహకరించాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని, పోలీస్‌స్టేషన్‌లో సీఐ జీవన గంగనాథ్‌బాబుకు ఫిర్యాదు చేశారు.



వంక పోరంబోకు స్థలం అమ్మేశారు

- ఎకరా రూ.4 లక్షలు
- మైసూరివారిపల్లెలో బయటపడిన భూదందా

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

- నోబెల్ ప్రైజ్ సాధించే స్థాయికి ఎదగాలి : వీసీ

వివరాలు... 7లో

దొరకునా ఇటువంటి సేవ..

- గరుడ వాహనంపై కడపరాయుడు
- రథసప్తమికి సిద్ధమవుతున్న తేరు




ముత్యపు పందిరి సేవ

కడప కల్చరల్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): "దొరకునా ఇటువంటి సేవ.. దొరకునా అల్ప తపమొనరించిన భూసురవరులకైన సురలకైన.." అంటూ గరుత్మంతుడు జగద్రక్షకుడు, సచ్చిదానందస్వరూపుడు అయిన కోనేటిరాయుడి సేవలో తరించాడు. కడప శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఐదవ రోజైన ఆదివారం రాత్రి గరుడ వాహనంపై కడపరాయుడు తన దేవేరులతో కొలువుదీరి దేవునికడప మాడవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారి ఉత్సవం ముందు కోలాటం, చెక్కభజనలు చేశారు. అలాగే కేరళ వాయిద్య కళాకారుల ప్రదర్శన భక్తులను అలరించారు. అంతకు ముందు ఉదయం దేవదేవుడు ముత్యపు పందిరి వాహనంపై మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్ సేవ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు వారు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. కాగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 4న మంగళవారం జరగనున్న రథసప్తమి వేడుకలకు ఆలయ తేరును సిద్ధం చేస్తున్నారు. కార్యక్రమంలో దేవునికడప ఆలయ ఇన్‌స్పెక్టరు ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


గరుడ వాహన సేవకు హాజరైన జనం



స్నేహితుడి పెళ్లికి వెళ్లి వస్తూ

తిరిగిరాని లోకాలకు

- మట్టి దిబ్బను ఢీకొన్న ద్విచక్రవాహనం
- యువకుడు దుర్మరణం.. మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన వంశీకృష్ణ..


వంశీకృష్ణ (ఫైల్)


ములకలచెరువు/మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడి పెళ్లికి వెళ్లి వస్తూ ద్విచక్రవాహనం అదుపు తప్పి మట్టి దిబ్బను ఢీకొనడంతో మదనపల్లెకు చెందిన ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు... మదనపల్లె పట్టణం చౌడేశ్వరీ కల్యాణ మండపం సమీపంలోని రింగ్‌రోడ్డులో నివాసం ఉంటున్న వెంకటసుబ్బారెడ్డి, రమాదేవి దంపతుల కుమారుడు వంశీకృష్ణారెడ్డి (24) శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వంశీకృష్ణారెడ్డి, అతడి స్నేహితుడు రవితేజలు శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లెలో జరుగుతున్న స్నేహితుడి పెళ్లికి వెళ్లారు. అక్కడ పెళ్లి చూసుకుని తిరిగి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యంలోని ములకలచెరువు మండలం పెద్దపాళ్యం వంతెన వద్దకు వచ్చేసరికి ద్విచక్రవాహనం మట్టిదెబ్బను ఢీకొంది. ఈ ప్రమాదంలో వంశీకృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా రవితేజ తీవ్రంగా గాయపడ్డాడు. రవితేజను చికిత్స నిమిత్తం 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా వంశీకృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లెకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. కాగా మృతుడి కుటుంబసభ్యులను ఆస్పత్రి మార్చురీ వద్ద తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు పరామర్శించారు.

వంగ ధర ఢమాల్

- కేజీ రూ.60 నుంచి రూ.10కి పడిపోయిన ధర
- బయటి ప్రాంతాల్లో దిగుబడులు పెరగడంతో తగ్గుముఖం

ములకలచెరువు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): వంగ ధర పతనమైంది. 20 రోజుల క్రితం వరకు కేజీ రూ.60 పలకగా క్రమంగా తగ్గుతూ రూ.10కి పడిపోయింది. బయటి ప్రాంతాల్లో దిగుబడులు పెరగడంతో ఇక్కడి ధరలపై ప్రభావం పడింది. నిన్నటి వరకు ఆశాజనకంగా ఉన్న వంగ ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయి. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో రైతులు సుమారు 800 ఎకరాల వరకు సాగు చేశారు. ఎకరా సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో ధరలు పతన స్థితికి చేరుకోవడంతో చేతికొచ్చిన పంట నోటికాడికి రాకుండాపోతోంది. పది రోజుల క్రితం వరకు ఆశాజనకంగా ఉన్న ధర ప్రస్తుతం రూ.10కి చేరింది. ఈ ప్రాంతంలో పండిన వంకాయలను వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసి చెన్నై మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. అలాగే పలువురు రైతులు స్వయంగా వారే చెన్నైకు తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. తమిళనాడు రాష్ట్రంలో గత నెలలో వరుసగా వచ్చిన రెండు తుఫాన్ల కారణంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. దీంతో అక్కడ సాగైన వంగ పంట పూర్తిగా దెబ్బతింది. ఫలితంగా ధరలు భారీగా పెరగడానికి కారణమైంది. వంకాయలు కేజీ రూ.60 వరకు పలికాయి. ఈ క్రమంలో అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో వంగ పంట భారీగా సాగవ్వడంతో అక్కడ ప్రస్తుతం దిగుబడులు అధికంగా వస్తున్నాయి. చెన్నై మార్కెట్‌కు ఈ ప్రాంతాల నుంచి వంకాయలు అధికంగా వస్తుండడంతో ఆ ప్రభావం ధరలపై పడింది. చెన్నై మార్కెట్‌కు గతంలో వచ్చే దాని కంటే రెట్టింపుగా వంకాయలు అమ్మకానికి వస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో ధరలు క్రమంగా పాతాళానికి చేరాయి.


వేపూరికోట సమీపంలో వంకాయ తోట సాగు


ధర లేక కోత విధించి పొలం వద్ద వదిలేసిన వంకాయలు

చెన్నై మార్కెట్‌కు తరలిస్తే రూ.10 పలికింది..



భూమిని కౌలుకు తీసుకుని నాలుగున్నర ఎకరాల్లో వంగ పంట సాగు చేశాను. దీనికి రూ.5 లక్షలకు పైగా ఖర్చు వచ్చింది. ప్రస్తుతం పంట దిగుబడి వస్తోంది. నిన్న వంకాయలను అమ్ముకొచ్చేందుకు చెన్నై మార్కెట్‌కు తీసుకెళ్లాను. కేజీ కేవలం రూ.10 పలికింది. దీంతో కనీసం కోత విధించిన కూలీ ఖర్చు కూడా రాలేదు.

- బాలాజీ, వంగ రైతు, గురకివారిపల్లె, ములకలచెరువు

వంక పోరంబోకు స్థలం అమ్మేశారు


ఎకరా రూ. 4 లక్షలు ● మైసూరివారిపల్లెలో బయటపడిన భూ దందా ● ఓ పార్టీలో మొదలైన కుమ్ములాట



వంకపోరంబోకు స్థలంలో బోర్డునాటిన రెవెన్యూశాఖాధికారులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వంక పోరంబోకు స్థలాన్ని ఏకంగా ఎకరం రూ. 4లక్షలకు అమ్ముకున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన భూ దందాపై విషయం బహిరంగ చర్చకు దారి తీసింది. వైసీపీ ప్రభుత్వంలో మైసూరివారిపల్లె గ్రామస్తులు కలిసి కట్టుగా భూమిని కాపాడుకున్నారు. ఇందులో కొంత స్థలాన్ని ఈద్గాకు కేటాయించారు. అంతేకాకుండా ఈ స్థలంపై కొన్ని నెలలపాటు వివాదం తలెత్తింది. ఫలితంగా వైసీపీతో మైసూరివారిపల్లె ప్రజలు పెద్ద పోరాటం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇదే భూమిపై ఓ పార్టీ నేతలు ముగ్గురు కన్నేశారు. ఎకరా రూ. 4లక్షలు చెప్పున అమ్ముకున్నారని బాహటంగా చెప్పుకుంటున్నారు. వివరాల్లోకెళితే....

రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లెలో సర్వే నెంబరు 2085లో మొత్తం 17.85 ఎకరాల వంక పోరంబోకు భూమి ఉంది. ఈ భూమి పక్కనే ఉన్న రీగల్ సోప్ పరిశ్రమ కొన్ని కారణాల చేత మూతపడింది. ఈస్థలం ప్రధానదారికి దగ్గరగా ఉండడంతో అందరి దృష్టి ఆ భూమి పైనే పడింది. ఈ పరిశ్రమ భవనాలు, స్థలాన్ని ఒక పారిశ్రామిక వేత్త తీసుకుని కొంత భాగాన్ని గత టీడీపీ ప్రభుత్వంలో కన్వర్షన్ చేయించుకుని అమ్ముకున్నారు. అంతేకాకుండా కాల క్రమేణా కొందరు కబ్జాదారులు ఆక్రమించుకుని మామిడి తోటలు వేసుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. మరికొందరు ఇంకొంత ముందుకెళ్లి ఈభూమిని కొంత భాగం ఆన్‌లైన్ చేసుకోవడం, ఈ విషయం బయట పడడంతో అధికారులు మళ్లీ రద్దు చేశారు. అప్పటి నుంచి ఈ భూమి వివాదంలోనే కొనసాగుతోంది. గతంలో సీపీఎం నేతలు, కార్యకర్తలు భూ పోరాటంలో భాగంగా జెండాలు పాతారు. దీంతో అప్పటి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని ఇది ప్రభుత్వ భూమి దీనిని ఎవరూ ఆక్రమించరాదని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమిపై కన్నేసిన వారు ఆక్రమణలు చేస్తూనే ఉన్నారు. భూమిని అమ్మేశాం తీసుకున్న వారు ఏమైనా చేసుకోవచ్చని ఇద్దరు బాబులు బహిరంగంగా చెబుతున్నారు.



సర్పంచ్ రాసిన వినతి పత్రం



మిగిలింది ఈ స్థలమే

ఇందులో ఓ పార్టీ నేతలు వాటాలు కావాలని వాదోపవాదాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వాల్లో ఆక్రమణ ప్రయత్నాలు ముమ్మరం సాగాయి. ప్రస్తుతం ఏకంగా ఓ పార్టీ నేతలు ముగ్గురు వంక పోరంబోకు భూమిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

17.85 ఎకరాల్లో మిగిలింది ఐదే...

మైసూరివారిపల్లె వంకపోరంబోకు భూమి 17.85 ఎకరాల్లో ఆక్రమణలు పోగా 5 ఎకరాలే మిగిలింది. కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. కంకర మిషన్ పెట్టుకుని ఒకరు ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. మరి కొందరు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. గతంలో కొందరు ప్లాట్లు వేసుకుని విక్రయించారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఏమి జరిగిందంటే....

చాలా కాలంగా రైల్వేకోడూరులో ముస్లింలకు ఈద్గా సమస్య ఉంది. ఉన్న ఈద్గాలో జనాలు రంజాన్, బక్రీదు తదితర పండుగలకు సరిపోవడం లేదని ముస్లింలు చాలా కాలంగా అడుగుతూ వచ్చారు. పాలకులు కాలయాపన చేశారు. ఎన్నికల సమయంలో ముస్లింల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని గుర్రుమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వంకపోరంబోకు భూమిలో కొంతభాగం ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వ పాలకులు నిర్ణయించారు. కట్టడాలు మొదలు పెట్టిన నాటి నుంచి పూర్తి అయ్యే వరకు మైసూరివారిపల్లె ప్రజలు అడ్డుకున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వ పాలకులు పోలీసులను పెట్టించి నిర్మాణాలు చేయించి పూర్తి చేశారు. అందులోనే రంజాన్, బక్రీదు పండుగల రోజున ముస్లింలు అందరూ పలు సార్లు ప్రార్థనలు చేశారు.

ఈద్గా స్థలాన్ని రద్దు చేయాలని ఎమ్మెల్యేకి విన్నపం

వంకపోరంబోకు స్థలంలో ఈద్గాకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలని మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త సంతకం చేసిన ఒక లెటర్ బయట పడింది. ఈ లెటర్ వంకపోరంబోకు భూ వివాదాన్ని మరింత తెరపైకి తెచ్చింది. సర్పంచ్‌ని వివరణ కోరగా.... వంకపోరంబోకు స్థలాన్ని పంచాయతీలోకి కలిపి ముందుగా సర్వే చేయించాలని, నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. ఈద్గా స్థలాన్ని రద్దు చేయమని తాను వినతిపత్రంలో రాయలేదన్నారు. ఈద్గా స్థలాన్ని రద్దు చేయమని ఎవరు రాశారో తనకు తెలియదన్నారు. ముస్లింలకు తమ గ్రామస్తులు వ్యతిరేకం కాదన్నారు. వారికి కూడా ఈద్గా స్థలాన్ని కేటాయించేందుకు తాను కృషి చేస్తామని తెలిపారు. వంకపోరంబోకు స్థలాన్ని అమ్ముకున్నారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఒక వేళ అమ్మకాలు జరిగి ఉంటే తాను ఎంత పోరాటానికైనా సిద్ధంగా ఉంటాన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ స్థలాన్ని కాపాడుకునేందుకు నిందలు, పోలీసుల బెదిరింపులు, కేసులు గ్రామస్తులు సహా ఎదుర్కొన్నామని గుర్తు చేశారు.



స్థలాన్ని కాపాడాలని రూపానందరెడ్డికి ముస్లింలు ఇస్తున్న వినతి (ఫైల్)

ఈద్గాకు కేటాయింపు రద్దు చేయకండి

ముస్లిం నేతలు కుడాచైర్మన్ ముక్కా రూపానందరెడ్డిని కలిసి ఈద్గాకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేస్తారని సమాచారం వచ్చిందని, రద్దు కాకుండా చేయాలని విన్నవించారు. ఈద్గా స్థలం ఎక్కడికీ పోదని మీకు అన్యాయం జరగనివ్వనని ముస్లింలకు ముక్కా రూపానందరెడ్డి, యువ నేత ముక్కా సాయి వికాస్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ముస్లింలు తెలిపారు.

ఆక్రమిస్తే చర్యలు

వంకపోరంబోకు స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు ఉంటాయని రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ తెలిపారు. వంకపోరంబోకు స్థలంలో ఎలాంటి కట్టడాలు ఉండరాదని, నాలుగెకరాల స్థలానికి కోర్టు స్టే ఇచ్చి ఉందన్నారు. కొన్ని నెలల కిందట ఉన్న ఆక్రమణలు తొలగించామన్నారు. వంకపోరంబోకు స్థలాన్ని అమ్మకం కుదరదని, ఒక వేళ కొన్నా చట్టరీత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. వంకపోరంబోకు స్థలాలను పట్టాలు, గృహాలు, కట్టడాలు చేయలేమని, అందుకు అనుమతి రాదని స్పష్టంగా వివరించారు.

ముగ్గురు నిందితులు అరెస్టు

● 11 తులాల బంగారు, ఓమ్నీ కారు స్వాధీనం



నిందితులు, బంగారు ఆభరణాలు చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ లింగప్ప ఆధ్వర్యంలో విలేకరులకు డీఎస్పీ నిందితుల వివరాలు తెలుపుతూ అనంతపురం జిల్లా, గుత్తి టౌన్, మారుతీనగర్ వాసులు వనార్చి అనంతమ్మ, వనార్చి మహేష్, వనార్చి గాయత్రి ఒకే డోర్ నంబరులో నివసిస్తున్నారు. జనవరి 30వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక కెనరా బ్యాంకులో పెద్దదండ్లూరు వాసులు ఇరగంరెడ్డి సావిత్రి, ఆమె భర్త కలిసి నాలుగు తులాల బంగారు ఆభరణాలతో బ్యాంకులో బంగారు తాకట్టుపెట్టి రుణం తెచ్చుకునేందుకు వచ్చారు. ఆమె క్యూలో ఉండగా బ్యాగు కట్ చేసి బంగారు చోరీ చేశారని, వాటి విలువ రూ.2 లక్షలకుపైగా అవుతుందని బాధితురాలు ఫిర్యాదు చేసింది. కెనరా బ్యాంకులో సీసీ ఫుటేజీ ఆధారంగా అనుమానితుల చిత్రాలను తీసుకుని పోలీసులు విచారణ ప్రారంభించారు. తాడిపత్రి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీ21.బియు.2685 నంబరు ఓమ్నీ కారులో ముగ్గురు వస్తుడంగా వారిని అనుమానంతో పట్టుకుని స్టేషన్‌కు తెచ్చినట్లు తెలిపారు. విచారణలో పలు ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు వారు అంగీకరించారన్నారు. వారి నుంచి 3 బంగారు చైన్లు (7 తులాలు), ఒక బంగారు హారం (2 తులాల), రెండు జతల బంగారు కమ్మలు (ఒక టిన్నర తులం), ఒక జత చెంపసారెలు (అరతులం), ఓమ్నీ కారు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బంగారు విలువ రూ.8.80 లక్షలు అవుతుందని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ లింగప్ప, ఎస్ఐ రామక్రిష్ణ, హెడ్‌కానిస్టేబుల్ దేవదాసు, కానిస్టేబుల్ రియాజ్, నాగేంద్ర, జ్యోతిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

నోబెల్ ప్రైజ్ సాధించే స్థాయికి ఎదగాలి : వీసీ



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాల్సిన అవసరం ఉందని వైవీయూ వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు నోబెల్ బహుమతి సాధించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఆదివారం కడప నగరం మరియాపురం సెయింట్ జోసెఫ్ బాలుర ఉన్నత పాఠశాలలో బాలోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని తల్లిదండ్రుల ద్వారా నిర్ణయించుకుంటారన్నారు. విద్యార్థులు చదువుతున్నారే తప్ప నోబెల్ ప్రైజ్ వచ్చేస్థాయిలో కష్టపడకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. కమిటీ అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఇంతటి కార్యక్రమం నిర్వహించారన్నారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ జగదీశ్వరరెడ్డి, విద్యావేత్త, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నాగమునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, ప్రసంగించారు. కమిటీ ప్రచార కార్యదర్శి శివరాం, కల్చరల్ కన్వీనర్ వెంకటసుబ్బయ్య, అకడమిక్ కన్వీనర్ మహేష్, గోపి, సర్దార్ ఫైజీ మగ్బుల్‌బాష, దేవదత్తం, సుందరయ్య, రామకృష్ణారెడ్డి, బాలయల్లారెడ్డి, ప్రొఫెసర్ మృత్యుంజయరావు, ఉషా తులసి, అరుణ, సరస్వతి, సునీత, వెంకటేశ్వర్లు, స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జాన్సన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడిన ఆవును కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

పీలేరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పాడుబడిన బావిలో ప్రమాదవశాత్తు పడిపోయిన పాడి ఆవును అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. కావలిపల్లె వాసి దేవి ఆవు స్థానిక నాగూరు రైస్ మిల్లు ప్రాంతంలో తిరుగుతూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి విషయం చేరవేయడంతో రంగంలోకి దిగి దానిని రక్షించారు. సుమారు రూ.70 వేలు విలువైన పాడి ఆవును కాపాడిన అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు.



బావిలో పడిన ఆవు

544 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్

ఎదురీదుతున్న హిమాచల్‌ప్రదేశ్



వెంకట రాహుల్(197 పరుగులు) - ప్రసాద్ (107)

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆంధ్ర - హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న కికెట్ మ్యాచ్ ఆదివారం ఆంధ్ర జట్టు 8 వికెట్ల నష్టానికి 544 పరుగులు సాధించి డిక్లేర్ చేసింది. కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా అండర్-23 మల్టీడేస్ నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 544 పరుగులు సాధించింది. అంతకు ముందు ఓవర్ నైట్ స్కోరు 5 వికెట్లనష్టానికి 360 పరుగులతో తిరిగి రెండో రోజు బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు మరో 184 పరుగులు జోడించి మొత్తంగా 135.5 ఓవర్లలో 8 వికెట్లను కోల్పోయి 544 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో ఓవర్ నైట్ స్కోరు 162 పరుగుల నాటౌట్ స్కోరుతో క్రీజ్‌లో ఉన్న వెంకటరాహుల్ ఎట్టకేలకు 197 పరుగులు సాధించి అవుట్ కాగా మరో బ్యాట్స్‌మెన్ ప్రసాద్ 107 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. ఇదిలా ఉండగా 544 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 159 పరుగుల చేశారు. ఆంగ్ర 51 పరుగులు చేయగా, యోగ్‌దీప్ ఠాగూర్ 50 పరుగులు చేశారు. దీంతో ఇంకా 385 పరుగుల లోటుతో ఎదురీదుతోంది. సోమవారం మూడోరోజు.

జిల్లా స్థాయి క్విజ్‌లో సంబేపల్లె విద్యార్థుల ప్రతిభ

సంబేపల్లె, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాయచోటి డైట్ కేంద్రంలో డిసెంబరు 21న నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో సంబేపల్లె విద్యార్థులు రుక్సానా, మౌనిక, తరుణ్ కుమార్‌గౌడ్ ప్రథమ స్థానం పొందినట్లు ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం కడప నాగార్జున డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఏకలవ్య ఫౌండేషన్ వార్షికోత్సవ సభలో విద్యార్థులకు మెమెంటో, మెరిట్ సర్టిఫికెట్ అందించినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన వీరికి కడప ఎంఈఓ గంగిరెడ్డి, నాగార్జున డిగ్రీ కళాశాల డైరెక్టర్ శివ విష్ణుమోహన్‌రెడ్డి, డీఈఓ కార్యాలయం ఏడీ మునీర్‌ఖాన్, పాఠశాల ఏకలవ్య కోఆర్డినేటర్ రెడ్డిశేఖర్, ఏకలవ్య ఫౌండేషన్ సలహాదారులు గునిపాటి శ్రీనివాసులు, ప్రశాంత్ తదితరులు విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

రూ.2000 కోసం చిరు వ్యాపారి హత్య



పులివెందుల టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించలేదని తోపుడుబండిపై అరటిపండ్లు అమ్మే వ్యాపారిని హత్య చేశారు. పుల్లారెడ్డి హాస్పిటల్ సమీపంలో నివాసి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దగ్గర తోపుడుబండిపై అరటిపండ్ల వ్యాపారం చేసుకునే మోహన్ (57) పట్టణానికి చెందిన ఓ అరటికాయల వ్యాపారికి రూ.2వేలు డబ్బు బాకీ ఉన్నాడు. ఆదివారం రాత్రి డబ్బు కావాలని మోహన్‌ను అడగడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో మోహన్‌ను కొట్టడంతో అక్కడే నేలకు ఒరిగి పడిపోయాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించే సమయానికి మృతి చెందాడు. దీనిపై సీఐ వెంకటరవణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి



సింహాద్రిపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లప్పగారి పార్వతమ్మ(80) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సింహాద్రిపురం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ సమాచారం మేరకు.. మృతురాలు పార్వతమ్మ ఇంటికి కొద్ది రోజులుగా ఇంటి బయట తాళం వేసి ఉండేది. ఆమె ఎక్కడికైనా పోయి వుండవచ్చని స్థానికులు అనుకున్నారు. శనివారం రాత్రి ఇంటి నుంచి దుర్వాసన వెలువడడంతో ఇరుగు పొరుగువారు అనంతపురంలో వున్న మృతురాలు కుమారులకు సమాచారం తెలిపారు. వారు పోలీసుల సమక్షంలో ఇంటి తలుపు తెరవగా పార్వతమ్మ మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. ఆమెను హత్యచేసి వుండవచ్చనే కోణంలో, పలుకోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలు కుమారుడు రామాంజులరెడ్డి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆదివారం పులివెందుల సీఐ వెంకటరమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలపై సీఐ విచారించారు. అనంతరం డాగ్, క్లూస్ టీమ్‌తో పరిశీలించారు. మృతురాలుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలదు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్థులను విచారిస్తున్న సీఐ వెంకటరమణ

లారీ, బైక్ ఢీ ఒకరికి గాయాలు

సిద్దవటం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారిపై శనివారం ఆగి ఉన్న లారీని బైక్ చోదకుడు ఢీకొట్టడంతో బలమైన గాయాలు తగిలాయి. స్థానిక పోలీసు సమాచారం మేరకు వేంపల్లె వాసులు మస్తాన్, బాబాఫక్రుద్దీన్ రేణిగుంట నారాయణ పాఠశాలలో చదువుతున్న మస్తాన్ పిల్లలకు ఫీజు కట్టి వేంపల్లెకు వస్తున్నారు. ద్విచక్ర వాహనం కడప - చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లె వద్ద ఆగి ఉన్న లారీని శనివారం రాత్రి 11.30 గంటలకు ఢీకొంది. దీంతో మస్తాన్ తలకు, ముఖానికి బలమైన గాయాలు తగిలాయి. గాయపడిన వ్యక్తిని హైవే పెట్రోలింగ్ పోలీసులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. జరిగిన ఘటనపై స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

'ఫీజుపోరు'కు అనుమతి కోరిన వైసీపీ నేతలు

కడప క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం జిల్లా పోలీసు కార్యాలయంలో వైసీపీ పిలుపు మేరకు ఈ నెల 5న ఫీజుపోరు కార్యక్రమానికి అనుమతి కోరుతూ ఎస్పీ అశోక్‌కుమార్‌ను ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధరెడ్డి, కడప నగర మేయరు కె.సురేశ్‌బాబు కలిశారు. కార్పొరేటర్లు మల్లికార్జున, కిరణ్, మహ్మద్‌షఫీ, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట క్రిష్ణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి షఫీ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

లింగాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండంలోని చిన్నకుడాల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన మదన్‌మోహన్, పెద్దక్కులు అనంతపురం జిల్లా నార్పలకు గృహప్రవేశం నిమిత్తం వెళ్లివస్తుండగా చిన్నకుడాలకు చేరుకోగానే, పెద్ద కుడాలగ్రామానికి చెందిన పఠాన్ కమాల్ అనే వ్యక్తి పులివెందుల నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా చిన్నకుడాలకు చేరుకోగానే ప్రమాదవశాత్తు కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.

బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

ఏపీసీసీ ప్రతినిధి తులసిరెడ్డి


వేంపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో గతంలో జరిగినట్లే ఈసారి కూడా కడప జిల్లాకు, రాయలసీమకు, రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లె లో కాంగ్రెస్ నేతలు నల్లబ్యాడ్జీలు పెట్టుకుని, నల్లజెండాలతో నిరసన దీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో మోదీ ప్రభుత్వ మనుగడ టీడీపీ మీద ఆధారపడి ఉన్నందున, రాష్ట్రానికి తప్పక న్యాయం జరుగుతుందని అందరూ భావించారన్నారు. విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరగాలని, కావాల్సిన భూమి, నీరు, విద్యుత్ శక్తి, రవాణా సౌకర్యాలు, ముడిపదార్థాలు జిల్లాలో ఉన్నా నిర్మాణానికి నోచుకోలేదని తెలిపారు. ఈసారి బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదన్నారు. కడప-రాయచోటి-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గానికి నిధులు మంజూరు, సీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఊసే లేదన్నారు. దీక్షలో కాంగ్రెస్ నేతలు రామాంజనేయరెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, వెంకటేశ్, మహబూబ్‌బాష, రవి, వినయ్, ఐచర్ రమణ, సాయిశ్యామ్, దిలీప్, కిరణ్, విజయ్, పాపయ్య పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొండాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంప్‌హౌస్ వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు ఆదివారం మధ్యాహ్నం గూడ్సు కింద పడడంతో తల, మొండెం వేర్వేరయ్యాయి. మృతుడికి సుమారు 45 ఏళ్లు ఉంటాయి. బ్లూచొక్కా ప్యాంటు ధరించాడు. ఇతను ఏ ప్రాంతీయుడో తెలియాల్సి ఉంది. వివరాలు తెలిస్తే తెలియజేయాలని ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.



రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం



8న నవోదయ ప్రవేశ పరీక్ష

రాజంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతులలో చేరగోరే విద్యార్థులకు ఈనెల 8న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం. గీత ఒక ప్రకటనలో తెలిపారు. . 9వ తరగతిలో చేరే విద్యార్థులకు రాజంపేటలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 11వ తరగతిలో చేరే విద్యార్థులకు జవహర్ నవోదయ విద్యాలయంలోనే ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారందరూ ఆన్‌లైన్‌లోనే హాల్ టిక్కెట్లు డౌన్‌లోడు చేసుకుని పరీక్ష కేంద్రానికి హాజరు కావాలన్నారు. ఏదైనా ఇబ్బందులు ఉంటే 7013635980, 9398780145, 9490466759 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణ జేఏసీ చైర్మన్‌గా నల్లగొల్ల గంగాధర్



లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ అన్నమయ్య జిల్లా చైర్మన్‌గా తనను నియమిస్తూ జాతీయ ఎస్సీ వర్గీకరణ కమిటీ ఎస్సీ, ఎస్టీ హబ్ సభ్యుడు సుదర్శన్ నుంచి ఉత్తర్వులు అందినట్లు నల్లగొల్ల గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

16 నుంచి ఏఐటీయూసీ మహాసభలు

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : రైల్వేకోడూరులో ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్న ఏఐటీయూసీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రాజంపేట ఆర్ అండ్ బి బంగ్లా ఆవరణలో ఏఐటీయూసీ నాయకులు గాలి చంద్ర, కార్యదర్శి సికిందర్, గౌరవాధ్యక్షుడు వెంకటయ్య ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ మహాసభల్లో చిరుద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సివిల్ సప్లై హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని తదితర సమస్యలను ప్రస్తావిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, జమాల్, సుబ్రమణ్యం, మహ్మద్‌హుస్సేన్, రమణ,జయరాం తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు బోనాలు

సుండుపల్లె, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈడిగపల్లి సమీపంలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బోనాలు సమర్పించారు. ఆలయ సమీపంలోని మామిడి తోటల్లో అన్నదానం చేశారు.

గంగమ్మకు పూజలు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం గ్రామంలో ఆదివారం గంగమ్మకు పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గంగమ్మజాతర ఈ నెల 28 నుంచి ప్రారంభం కానుంది దీంతో భక్తులు ప్రతి ఆధివారం వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ముడుపులు,మొక్కుబడులు చెల్లిస్తారు. ఇప్పటికే జాతర ఆవరణతా చిరువ్యాపారులతో నిండిపోయింది.

గణిత ఉపాధ్యాయుడికి పురస్కారం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జడ్పీహైస్కూల్లో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న వొంటికొండ చలపతినాయుడు తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లె కళాక్షేత్రంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు పురస్కారాలు అందజేశారు. గణిత ఉపాధ్యాయుడుగా సులువైన పద్ధతిలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధనలు అందించిన చలపతినాయుడుకు ఈ పురస్కారాన్ని అందజేశారు.

పార్కింగ్‌కు స్థలం లేక.. ప్రజల ఇక్కట్లు

● పట్టించుకోని పాలకులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు పట్టణంలో వాహనాల పార్కింగుకు స్థలంలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని లక్ష్మీప్యారడైజ్ థియేటర్ నుంచి వైఎస్ సర్కిల్, రైల్వేస్టేషన్, వైఎస్, అల్లూరి, అంబేడ్కర్, కృష్ణదేవరాయులు, పొట్టిశ్రీరాములు, ఎన్టీఆర్ సర్కిళ్లు జనసమ్మర్దం అధికంగా ఉంటుంది. దుకాణాలు కూడా అధికంగానే ఉంటాయి. ఆయా దుకాణాలకు వచ్చిన ప్రజలు తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కనే నిలుపుకోవాల్సి వస్తోందిద. దీంతో ప్రధాన రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఆటంకం ఏర్పడి, ట్రాఫిక్ సమస్యకు కారణమవుతోంది. గత టీడీపీ ప్రభుత్వంలో పట్టణంలోని ప్రధాన రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించి సిమెంటు రోడ్డుతోపాటు డివైడర్లు కూడా ఏర్పాటు చేసింది. వర్షపు నీరు వెళ్లేందుకు డ్రైనేజీ కూడా ఏర్పాటుచేసి దానిపై మూతలు వేసింది. ప్రస్తుతం ఈ కాలువల పైనే ద్విచక్ర వాహనాలు నిలుపుకుంటున్నారు. ఇప్పటికైనా పార్కింగ్ స్థలం ఏర్పాటుకు పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై రైల్వేకోడూరు సీఐ కే. హేమసుందరరావు మాట్లాడుతూ పార్కింగ్ స్థలం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు పక్క స్థలాల ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని పంచాయతీ అధికారులకు పలుసార్లు లేఖలు రాశామన్నారు. మరో సారి పంచాయతీ వారికి గుర్తు చేస్తామని వివరించారు.



పోలీస్‌స్టేషన్ ఎదురుగా ప్రధానదారిలో నిలిపిన వాహనాలు

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లు లాంటివని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంతో పరుగులు పెట్టిస్తున్నార రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చిన్నమండెం మండలం వండాడి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు, వీధిలైట్లు తదితర మౌలిక వసతులు కల్పించి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలలకే ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వేసవి కాలంలో నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలను స్వీకరించి, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కారాదు

రామాపురం: విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం రామాపురం మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటోందని, అలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరప్రసాద్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ

పుల్లంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపేట పంచాయతీలో ఐదు లక్షల రూపాయల నిధులతో ఏర్పాటు చేస్తున్న సిమెంటు రోడ్డు పనులకు ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, ముక్కా వరలక్ష్మి భూమిపూజ చేశారు. కోనయ్యగారిపల్లె పంచాయతీ కొమానుపల్లె హరిజనవాడ, అరుంధతివాడల్లో కూడా పనులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పల్లె రోడ్లన్నీ సిమెంటు రోడ్లుగా మారుతున్నాయన్నారు. అనంతరం వత్తలూరు పంచాయతీ మల్లెంవారిపల్లె కు చెందిన బి.సుబ్బారెడ్డికి ఎమ్మెల్యే శ్రీధర్ సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌మిటీ మాజీ చైర్మన్ నేలపాటి రామచంద్ర నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆరె సుదాకర్‌నాయుడు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు, పోలి జగదీశ్వర్‌రెడ్డి, చుండు ఈశ్వర నాయుడు, కేసినేని నారాయణనాయుడు, లింగుట్ల వెంకటరమణ, కేవీఎస్ యాదవ్, చిన్నం శివయ్య, జనసేన అధ్యక్షులు ప్రసాద్, వెంకటరమణ, సౌభాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కుడా చైర్మన్ రూపానందరెడ్డి



మల్లెంవారిపల్లెలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

సాయిలోకేశ్‌కు ఆత్మీయ అభినందన



సాయిలోకేశ్‌ను ఘనంగా సత్కరిస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు

రాజంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్ర జ్యోతి) : అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడుగా సాయిలోకేశ్ రెండో సారి నియమితులైన సందర్భంగా ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సీ మోర్చా నాయకులు మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో రాజంపేట పార్లమెంట్‌లో బీజేపీని అంచలంచెలుగా అభివృద్ధి చేస్తున్న సాయిలోకేశ్‌ను రెండో సారి నియమించడంతో వచ్చే ఎన్నికల నాటికి రాజంపేట పార్లమెంట్‌లో బీజేపీ విజయపథంలో నడుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బీర్‌అహ్మద్, కోడూరు అసెంబ్లీ కన్వీనర్ చెంగల్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు వై. సురేష్‌రాజు, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు సునీత నారాయణవర్మ తదితరులు భారీ గజమాలలు, శాలువాలతో సాయిలోకేశ్‌ను సన్మానించారు.

ఫీజు పోరును విజయవంతం చేయాలి

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసినందుకు నిరసనగా ఈ నెల 5న కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న వైసీపీ ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైసీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వారు రాయచోటి పట్టణంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్, వైసీపీ అన్నమయ్య జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు జంగంరెడ్డి కిశోర్‌దాస్, వైసీపీ నాయకులతో కలిసి ఫీజు పోర పోస్టర్‌ను ఆవిష్కరించారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు రాయచోటి కలెక్టరేట్ మెయిన్ గేట్ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు.

జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ విజేతకు సన్మానం

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణపతకం సాధించిన కొర్లకుంట నాగరాజును ఆదివారం లక్కిరెడ్డిపల్లెలో టీడీపీ డాక్టర్స్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ షఫీనాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షుడు పక్కీరయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోవింద్, వెంకటేసు, మసూద్, అహ్మద్, కదిరి నరేష్, లక్ష్మయ్య, వెంకటేసు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగరాజును సన్మానిస్తున్న షఫీనాయక్

హిందీ విద్వాన్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

పుల్లంపేట, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని టి.కమ్మపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు హైదరాబాద్ హిందీ ప్రచారసభ నిర్వహించిన హిందీ విద్వాన్ పరీక్షల్లో 70 శాతం పైగా మార్కులు సాధించి ప్రతిభ చూపినట్లు హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్‌హుస్సేన్ తెలిపారు. పదో తరగతికి చెందిన కె.అమృత, ఆర్.మైథిలి, పి.చరణ్ ప్రమాణ పత్రాలు అందుకున్నట్లు ఆయన తెలిపారు. భవిష్యత్‌లో వీరు హిందీ అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హత పొందారని తెలిపారు.



ప్రతిభ సర్టిఫికెట్లతో విద్యార్థులు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో ప్రధాన వీధిలో బేకరిషాపు పక్కన అనాథ యాచకుడు మృతి చెందాడు. గమనించిన స్థానికులు సర్పంచ్ నూకా జైపాల్ రెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన అంత్యక్రియలు నిర్వహింపజేశారు. పోలీసులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లావాదేవీలను క్రమబద్ధీకరించుకోవాలి

● మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): మానవత సంస్థ లావాదేవీలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించుకోవాలని మానవత సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో ఆ సంస్థ డివిజన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలు కూడా సమన్వయంతో సేవలందించాలని సూచించారు. అధ్యక్షులు, సెక్రటరీలు ఏడాది వరకే కొనసాగుతారని, అన్ని కార్యక్రమాలు కూడా వారి ద్వారానే జరగాలన్నారు. అవసరమైనపుడు చైర్మన్, కన్వీనర్, ఇతర సీనియర్ల సలహాలు పాటించాలన్నారు. ఈ అంశాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల్లో అమలు అయ్యేలా చూడాలని కోరారు. రాయచోటి డివిజన్‌లో అన్ని శాఖలు కూడా చురుకుగా పనిచేస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుండడం అభినందనీయమన్నారు. ఎటువంటి రాజకీయాలకు తావు లేకుండా అందరు కూడా సహృదయంతో సేవలందిస్తూ సంస్థను మరింత ముందుకు తీసుకువెళ్లాలన్నారు.

వైభవంగా గోపురం ప్రతిష్ఠోత్సవాలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 2(ఆంధ్ర జ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయ రాజగోపురం ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఆదివారం తెల్లవారుజామునే టీటీడీ వేదపండితులు స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. వేదపండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ మండపంలోని యాగశాలలో చతుష్ఠానార్చన హోమం, మధ్యాహ్నం నేత్రోన్మీలనం, చాయాధివాసం నిర్వహించారు. సాయంత్రం ఆలయ గోపుర కలశాలకు పూజలు చేశారు. భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాల్లో పాల్గొని, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

పోరాటాలతోనే కార్మిక హక్కుల పరిరక్షణ

● జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బలమైన పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు, చట్టాలను పరిరక్షించుకోవచ్చునని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రద్దు చేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటుతున్నా భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు, మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బత్తల రమణ, హుస్సేన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కేశవరావు, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సాంబశివ

బాలబ్రహ్మేశ్వరాలయంలో సీసీ కెమెరాలు ప్రారంభం

సిద్దవటం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలబ్రహ్మేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన 5 సీసీ కెమెరాలను ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో నేరాలను అరికట్టడంలో భాగంగా కడప నగరానికి చెందిన గిరిధర్, అతికారి సుబ్బరాయుడు సహకారంతో, 40 వేల వ్యయంతో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌ఐ శివప్రసాద్, ఏఎస్‌ఐ సుబ్బరామచంద్ర, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు

సీసీ రోడ్ల పనులకు ప్రతిపాదనలు

సిద్దవటం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డేగలవారిపల్లె, టక్కోలు గ్రామాల్లో ఆదివారం పంచాయతీరాజ్ ఈఈ రామచంద్రనాయక్, ఏఈ నాగరాజు, డీఈ శ్రీనివాసులు పర్యటించారు. ఈ సందర్భంగా ఏఈ నాగరాజు మాట్లాడుతూ 70 లక్షల రూపాయల వ్యవధితో ఈ గ్రామాల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నామని, నివేదిక రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి నాగమునిరెడ్డి పాల్గొన్నారు.



డేగలవారిపల్లెలో పర్యటిస్తున్న పంచాయతీరాజ్ అధికారులు

రేపు తలనీలాల సేకరణ హక్కుల వేలం

సిద్దవటం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిత్యపూజస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు తలనీలాలు సేకరించుకునే హక్కులకు ఈ నెల 4న ఉదయం 11 గంటలకు సిద్దవటంలోని రంగనాథస్వామి దేవాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి మోహన్‌రెడ్డి తెలియజేశారు. ఈ వేలంలో పాల్గొనదలచినవారు లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించాలన్నారు. హక్కులు దక్కించుకున్నవారు పూర్తి మొత్తం చెల్లించి రసీదు పొందాలన్నారు. మిగిలిన షరతులు వేలం సమయంలో తెలియజేస్తామని వివరించారు.

'ప్రతి కార్యకర్తకు తోడుగా ఉంటాం'

సంబేపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కష్టాలో ఉన్న ప్రతి వైసీపీ కార్యకర్తకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లె గ్రామం సుద్దలవాండ్లపల్లెలో ఆయన వైసీపీ కార్యకర్తలు, నాయకులతో చర్చించారు. ఏ కష్టం వచ్చినా తోడుగా ఉంటానని భరోసానిచ్చారు. డీసీసీబీ మాజీ డైరెక్టర్ శలికిరెడ్డి వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చిన్నమండెంలో ఉరుసు

చిన్నమండెం, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హజరత్ షా అలీ గంజే సాహిద్ బాబా రహంతుల్లా అలైహి దర్గాలో సోమవారం రాత్రి గంధం ఉత్సవం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రి 9 గంటలకు సాహెబ్ సాబ్ ఇంటి నుంచి బయలుదేరిన గంధం దర్గా వద్దకు చేరుకుంటుందన్నారు. కడపకు చెందిన హజరత్ క్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మహమ్మద్ హుస్సేని చిట్టిఫుల్ ఖాదర్‌వలి ఫాతెహా చేస్తారన్నారు. మంగళవారం ఉరుసు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని భక్తాదులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.



ఉరుసుకు ముస్తాబైన దర్గా

సమస్యల పరిష్కారంలో 'మజ్దూర్' ముందంజ

నందలూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారంలో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ముందంజలో ఉంటుందని గుంతకల్ డివిజనల్ మజ్దూర్ యూనియన్ ప్రెసిడెంట్ కామ్రేడ్ బీఎం బాషా తెలిపారు. డివిజన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన తర్వాత మొదటిసారి నందలూరు వచ్చిన ఆయనకు స్థానిక కార్మికులు స్వాగతం పలికారు. నందలూరు రైల్వేస్టేషన్ నుంచి ర్యాలీగా వచ్చి మజ్దూర్ యూనియన్ ఆఫీసులో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ చైర్మన్ పి.గోపీనాథ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లు మజ్దూర్ యూనియన్‌కు సెక్రటరీగా, చైర్మన్‌గా సేవలందించిన బీఎం బాషా భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరారు. యూనియన్ సెక్రటరి కె.విశ్వనాథ్ మాట్లాడుతూ బీఎం బాషా యూనియన్ కోసం కమిట్‌మెంట్‌తో పనిచేసే వారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



బీఎం బాషాకు స్వాగతం పలుకుతున్న మజ్దూర్ యూనియన్ కార్మికులు

బలిజపల్లె ఆలయాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో పట్టణంలోని ప్రధానదారికి పక్కనే ఉన్న బలిజపల్లె గంగమ్మ ఆలయ ముందు భాగం దెబ్బతినింది. హుండీ, రేకులు చెల్లాచెదురయ్యాయి. బస్సును అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరగగా, ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఆలయ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు.



దెబ్బతిన్న ఆలయ ముందు భాగం

వంక పొరంబోకు స్థలం అమ్మేశారు


ఎకరా రూ. 4 లక్షలు ● మైసూరివారిపల్లెలో బయటపడిన భూ దందా ● ఓ పార్టీలో మొదలైన కుమ్ములాట



వంకపొరంబోకు స్థలంలో బోర్డునాటిన రెవెన్యూశాఖాధికారులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): వంక పొరంబోకు స్థలాన్ని ఏకంగా ఎకరం రూ. 4లక్షలకు అమ్ముకున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన భూ దందాపై విషయం బహిరంగ చర్చకు దారి తీసింది. వైసీపీ ప్రభుత్వంలో మైసూరివారిపల్లె గ్రామస్తులు కలిసి కట్టుగా భూమిని కాపాడుకున్నారు. ఇందులో కొంత స్థలాన్ని ఈద్గాకు కేటాయించారు. అంతేకాకుండా ఈ స్థలంపై కొన్ని నెలలపాటు వివాదం తలెత్తింది. ఫలితంగా వైసీపీతో మైసూరివారిపల్లె ప్రజలు పెద్ద పోరాటం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇదే భూమిపై ఓ పార్టీ నేతలు ముగ్గురు కన్నేశారు. ఎకరా రూ. 4లక్షలు చెప్పున అమ్ముకున్నారని బాహటంగా చెప్పుకుంటున్నారు. వివరాల్లోకెళితే....

రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లెలో సర్వే నెంబరు 2085లో మొత్తం 17.85 ఎకరాల వంక పొరంబోకు భూమి ఉంది. ఈ భూమి పక్కనే ఉన్న రీగల్ సోప్ పరిశ్రమ కొన్ని కారణాల చేత మూతపడింది. ఈస్థలం ప్రధానదారికి దగ్గరగా ఉండడంతో అందరి దృష్టి ఆ భూమి పైనే పడింది. ఈ పరిశ్రమ భవనాలు, స్థలాన్ని ఒక పారిశ్రామిక వేత్త తీసుకుని కొంత భాగాన్ని గత టీడీపీ ప్రభుత్వంలో కన్వెర్షన్ చేయించుకుని అమ్ముకున్నారు. అంతేకాకుండా కాల క్రమేణా కొందరు కబ్జాదారులు ఆక్రమించుకుని మామిడి తోటలు వేసుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. మరికొందరు ఇంకొంత ముందుకెళ్లి ఈభూమిని కొంత భాగం ఆన్‌లైన్ చేసుకోవడం, ఈ విషయం బయట పడడంతో అధికారులు మళ్లీ రద్దు చేశారు. అప్పటి నుంచి ఈ భూమి వివాదంలోనే కొనసాగుతోంది. గతంలో సీపీఎం నేతలు, కార్యకర్తలు భూ పోరాటంలో భాగంగా జెండాలు పాతారు. దీంతో అప్పటి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని ఇది ప్రభుత్వ భూమి దీనిని ఎవరూ ఆక్రమించరాదని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ భూమిపై కన్నేసిన వారు ఆక్రమణలు చేస్తూనే ఉన్నారు. భూమిని అమ్మేశాం తీసుకున్న వారు ఏమైనా చేసుకోవచ్చని ఇద్దరు బాబులు బహిరంగంగా చెబుతున్నారు. ఇందులో ఓ పార్టీ నేతలు వాటాలు కావాలని వాదోపవాదాలు చేసుకుంటున్నారు. కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వాల్లో ఆక్రమణ ప్రయత్నాలు ముమ్మరం సాగాయి. ప్రస్తుతం ఏకంగా ఓ పార్టీ నేతలు ముగ్గురు వంక పొరంబోకు భూమిని అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



సర్పంచ్ రాసిన వినతి పత్రం



మిగిలింది ఈ స్థలమే

17.85 ఎకరాల్లో మిగిలింది ఇదే...

మైసూరివారిపల్లె వంకపొరంబోకు భూమి 17.85 ఎకరాల్లో ఆక్రమణలు పోగా 5 ఎకరాలే మిగిలింది. కొందరు ఇళ్లు నిర్మించుకున్నారు. కంకర మిషన్ పెట్టుకుని ఒకరు ఆక్రమించుకుని దర్జాగా అనుభవిస్తున్నారు. మరికొందరు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. గతంలో కొందరు ప్లాట్లు వేసుకుని విక్రయించారు. ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ ప్రభుత్వంలో ఏమి జరిగిందంటే....

చాలా కాలంగా రైల్వేకోడూరులో ముస్లింలకు ఈద్గా సమస్య ఉంది. ఉన్న ఈద్గాలో జనాలు రంజాన్, బక్రీదు తదితర పండుగలకు సరిపోవడం లేదని ముస్లింలు చాలా కాలంగా అడుగుతూ వచ్చారు. పాలకులు కాలయాపన చేశారు. ఎన్నికల సమయంలో ముస్లింల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని గుర్రుమన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వంకపొరంబోకు భూమిలో కొంతభాగం ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వ పాలకులు నిర్ణయించారు. కట్టడాలు మొదలు పెట్టిన నాటి నుంచి పూర్తి అయ్యే వరకు మైసూరివారిపల్లె ప్రజలు అడ్డుకున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వ పాలకులు పోలీసులను పెట్టించి నిర్మాణాలు చేయించి పూర్తి చేశారు. అందులోనే రంజాన్, బక్రీదు పండుగల రోజున ముస్లింలు అందరూ పలు సార్లు ప్రార్థనలు చేశారు.

ఈద్గా స్థలాన్ని రద్దు చేయాలని ఎమ్మెల్యేకి విన్నపం

వంకపొరంబోకు స్థలంలో ఈద్గాకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేయాలని మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త సంతకం చేసిన ఒక లెటర్ బయట పడింది. ఈ లెటర్ వంకపొరంబోకు భూ వివాదాన్ని మరింత తెరపైకి తెచ్చింది. సర్పంచ్‌ని వివరణ కోరగా.... వంకపొరంబోకు స్థలాన్ని పంచాయ తీలోకి కలిపి ముందుగా సర్వే చేయించాలని, నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని కోరినట్లు వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. ఈద్గా స్థలాన్ని రద్దు చేయమని తాను వినతిపత్రంలో రాయలేదన్నారు. ఈద్గా స్థలాన్ని రద్దు చేయమని ఎవరు రాశారో తనకు తెలియదన్నారు. ముస్లింలకు తమ గ్రామస్తులు వ్యతి రేకం కాదన్నారు. వారికి కూడా ఈద్గా స్థలాన్ని కేటాయించేందుకు తాను కృషి చేస్తామని తెలిపారు. వంకపొరంబోకు స్థలాన్ని అమ్ముకున్నారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఒక వేళ అమ్మకాలు జరిగి ఉంటే తాను ఎంత పోరాటానికైనా సిద్ధంగా ఉంటాన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఈ స్థలాన్ని కాపాడుకునేందుకు నిందలు, పోలీసుల బెదిరింపులు, కేసులు గ్రామస్తులు సహా ఎదుర్కొన్నామని గుర్తు చేశారు.



స్థలాన్ని కాపాడాలని రూపానందరెడ్డికి ముస్లింలు ఇస్తున్న వినతి (ఫైల్)

ఈద్గాకు కేటాయింపు రద్దు చేయకండి

ముస్లిం నేతలు కుడాచైర్మన్ ముక్కా రూపానందరెడ్డిని కలిసి ఈద్గాకు కేటాయించిన స్థలాన్ని రద్దు చేస్తారని సమాచారం వచ్చిందని, రద్దు కాకుండా చేయాలని విన్నవించారు. ఈద్గా స్థలం ఎక్కడికీ పోదని మీకు అన్యాయం జరగనివ్వనని ముస్లింలకు ముక్కా రూపానందరెడ్డి, యువ నేత ముక్కా సాయి వికాస్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ముస్లింలు తెలిపారు.

ఆక్రమిస్తే చర్యలు

వంకపొరంబోకు స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు ఉంటాయని రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ తెలిపారు. వంకపొరంబోకు స్థలంలో ఎలాంటి కట్టడాలు ఉండరాదని, నాలుగెకరాల స్థలానికి కోర్టు స్టే ఇచ్చి ఉందన్నారు. కొన్ని నెలల కిందట ఉన్న ఆక్రమణలు తొలగించామన్నారు. వంకపొరంబోకు స్థలాన్ని అమ్మకం కుదరదని, ఒక వేళ కొన్నా చట్టరిత్యా చర్యలు ఉంటాయని తెలిపారు. వంకపొరంబోకు స్థలాలను పట్టాలు, గృహాలు, కట్టడాలు చేయలేమని, అందుకు అనుమతి రాదని స్పష్టంగా వివరించారు.

ముగ్గురు నిందితులు అరెస్టు

● 11 తులాల బంగారు, ఓమ్నీ కారు స్వాధీనం



నిందితులు, బంగారు ఆభరణాలు చూపుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ లింగప్ప ఆధ్వర్యంలో విలేకరులకు డీఎస్పీ నిందితుల వివరాలు తెలుపుతూ అనంతపురం జిల్లా, గుత్తి టౌన్, మారుతీనగర్ వాసులు వనార్చి అనంతమ్మ, వనార్చి మహేష్, వనార్చి గాయత్రి ఒకే డోర్ నంబరులో నివసిస్తున్నారు. జనవరి 30వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక కెనరా బ్యాంకులో పెద్దదండ్లూరు వాసులు ఇరగంరెడ్డి సావిత్రి, ఆమె భర్త కలిసి నాలుగు తులాల బంగారు ఆభరణాలతో బ్యాంకులో బంగారు తాకట్టుపెట్టి రుణం తెచ్చుకునేందుకు వచ్చారు. ఆమె క్యూలో ఉండగా బ్యాగు కట్ చేసి బంగారు చోరీ చేశారని, వాటి విలువ రూ.2 లక్షలకుపైగా అవుతుందని బాధితురాలు ఫిర్యాదు చేసింది. కెనరా బ్యాంకులో సీసీ ఫుటేజీ ఆధారంగా అనుమానితుల చిత్రాలను తీసుకుని పోలీసులు విచారణ ప్రారంభించారు. తాడిపత్రి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఏపీ21.బియు.2685 నంబరు ఓమ్నీ కారులో ముగ్గురు వస్తుడంగా వారిని అనుమానంతో పట్టుకుని స్టేషన్‌కు తెచ్చినట్లు తెలిపారు. విచారణలో పలు ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు వారు అంగీకరించారన్నారు. వారి నుంచి 3 బంగారు చైన్లు (7 తులాలు), ఒక బంగారు హారం (2 తులాల), రెండు జతల బంగారు కమ్మలు (ఒక టిన్నర తులం), ఒక జత చెంపసారెలు (అరతులం), ఓమ్నీ కారు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బంగారు విలువ రూ.8.80 లక్షలు అవుతుందని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ లింగప్ప, ఎస్ఐ రామక్రిష్ణ, హెడ్‌కానిస్టేబుల్ దేవదాసు, కానిస్టేబుల్ రియాజ్, నాగేంద్ర, జ్యోతిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

544 పరుగుల భారీ స్కోరు వద్ద డిక్లేర్

ఎదురీదుతున్న హిమాచల్‌ప్రదేశ్





వెంకట రాహుల్(197 పరుగులు) - ప్రసాద్ (107)

కడప స్పోర్ట్స్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో ఆంధ్ర - హిమాచల్ ప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న కికెట్ మ్యాచ్ ఆదివా రం ఆంధ్ర జట్టు 8 వికెట్ల నష్టానికి 544 పరుగులు సాధించి డిక్లేర్ చేసింది. కల్నల్ సీకే నా యుడు ట్రోఫీలో భాగంగా అండర్-23 మల్టీడేస్ నాలుగు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 544 పరుగులు సాధించింది. అంతకు ముందు ఓవ ర్ నైట్ స్కోరు 5 వికెట్లనష్టానికి 360 పరుగులతో తిరిగి రెండో రోజు బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు మరో 184 పరుగులు జోడించి మొత్తంగా 135.5 ఓవర్లలో 8 వికెట్లను కోల్పోయి 544 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో ఓవర్ నైట్ స్కోరు 162 పరుగుల నాటౌట్ స్కోరుతో క్రీజ్‌లో ఉన్న వెంకటరాహుల్ ఎట్టకేలకు 197 పరుగులు సాధించి అవుట్ కాగా మరో బ్యాట్స్‌మెన్ ప్రసాద్ 107 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. ఇదిలా ఉండగా 544 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన హిమాచల్ ప్రదేశ్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 159 పరుగుల చేశారు. ఆంగ్ర 51 పరుగులు చేయగా, యోగ్‌దీప్ ఠాగూర్ 50 పరుగులు చేశారు. దీంతో ఇంకా 385 పరుగుల లోటుతో ఎదురీదుతోంది. సోమవారం మూడోరోజు.

లారీ, బైక్ ఢీ ఒకరికి గాయాలు

సిద్దవటం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప - చెన్నై జాతీయ రహదారిపై శనివారం ఆగి ఉన్న లారీని బైక్ చోదకుడు ఢీకొట్టడంతో బలమైన గాయాలు తగిలాయి. స్థానిక పోలీసు సమాచారం మేరకు వేంపల్లె వాసులు మస్తాన్, బాబాఫక్రుద్దీన్ రేణిగుంట నారాయణ పాఠశాలలో చదువుతున్న మస్తాన్ పిల్లలకు ఫీజు కట్టి వేంపల్లెకు వస్తున్నారు. ద్విచక్ర వాహనం కడప - చెన్నై జాతీయ రహదారి కనుమలోపల్లె వద్ద ఆగి ఉన్న లారీని శనివారం రాత్రి 11.30 గంటలకు ఢీకొంది. దీంతో మస్తాన్ తలకు, ముఖానికి బలమైన గాయాలు తగిలాయి. గాయపడిన వ్యక్తిని హైవే పెట్రోలింగ్ పోలీసులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. జరిగిన ఘటనపై స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

'ఫీజుపోరు'కు అనుమతి కోరిన వైసీపీ నేతలు

కడప క్రైం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం జిల్లా పోలీసు కార్యాలయంలో వైసీపీ పిలుపు మేరకు ఈ నెల 5న ఫీజుపోరు కార్యక్రమానికి అనుమతి కోరుతూ ఎస్పీ అశోక్‌కుమార్‌ను ఆదివారం మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, కడప నగర మేయరు కె.సురేశ్‌బాబు కలిశారు. కార్పొరేటర్లు మల్లికార్జున, కిరణ్, మహ్మద్‌షఫీ, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దాస రి శివప్రసాద్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట క్రిష్ణ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి షఫీ తదితరులు ఉన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

కొండాపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంప్‌హౌస్ వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు ఆదివారం మధ్యాహ్నం గూడ్సు కింద పడడంతో తల, మొండెం వేర్వేరయ్యాయి. మృతుడికి సుమారు 45 ఏళ్లు ఉంటాయి. బ్లూచొక్కా ప్యాంటు ధరించాడు. ఇతను ఏ ప్రాంతీయుడో తెలియాల్సి ఉంది. వివరాలు తెలిస్తే తెలియజేయాలని ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా, ఉల్లాసంగా



ట్రిపుల్‌ఐటీలో మారథాన్ నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థులు

వేంపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో 2008 పూర్వ విద్యార్థులు ఆదివారం ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. మొదటి రోజు అధికారులతో సమావేశమైన విద్యార్థులు రెండో రోజు ఆదివారం ఆటపాటలతో గడిపారు. క్యాంపస్ సెంట్రల్ లైబ్రరీ సమీపంలో మారథాన్ నిర్వహించారు. ల్యాబ్ కాంప్లెక్స్‌ను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఆత్మీయంగా ఒకరినొకరి గురించి తెలుసుకుని చదువుకున్న నాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకుని ఆనందంగా గడిపారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

నోబెల్ ప్రైజ్ సాధించే స్థాయికి ఎదగాలి : వీసీ



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాల్సిన అవసరం ఉందని వైవీయూ వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు నోబెల్ బహుమతి సాధించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఆదివారం కడప నగరం మరియాపురం సెయింట్ జోసెఫ్ బాలుర ఉన్నత పాఠశాలలో బాలోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని తల్లిదండ్రుల ద్వారా నిర్ణయించుకుంటారన్నారు. విద్యార్థులు చదువుతున్నారే తప్ప నోబెల్ ప్రైజ్ వచ్చేస్థాయిలో కష్టపడకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. కమిటీ అధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ అందరి సహకారంతో ఇంతటి కార్యక్రమం నిర్వహించారన్నారు. ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ జగదీశ్వరరెడ్డి, విద్యావేత్త, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నాగమునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, ప్రసంగించారు. కమిటీ ప్రచార కార్యదర్శి శివరాం, కల్చరల్ కన్వీనర్ వెంకటసుబ్బయ్య, అకడమిక్ కన్వీనర్ మహేష్, గోపి, సర్దార్ ఫైజీ మగ్బుల్‌బాష, దేవదత్తం, సుందరయ్య, రామకృష్ణారెడ్డి, బాలయల్లారెడ్డి, ప్రొఫెసర్ మృత్యుంజయరావు, ఉషా తులసి, అరుణ, సరస్వతి, సునీత, వెంకటేశ్వర్లు, స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జాన్సన్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడిన ఆవును కాపాడిన అగ్నిమాపక సిబ్బంది



బావిలో పడిన ఆవు

పీలేరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పాడుబడిన బావిలో ప్రమాదవశాత్తు పడిపోయిన పాడి ఆవును అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. కావలిపల్లె వాసి దేవి ఆవు స్థానిక నాగూరు రైస్ మిల్లు ప్రాంతంలో తిరుగుతూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి విషయం చేరవేయడంతో రంగంలోకి దిగి దానిని రక్షించారు. సుమారు రూ.70 వేలు విలువైన పాడి ఆవును కాపాడిన అగ్నిమాపక సిబ్బందిని అభినందించారు.

జిల్లా స్థాయి క్విజ్‌లో సంబేపల్లె విద్యార్థుల ప్రతిభ

సంబేపల్లె, ఫిబ్రవరి2(ఆంధ్రజ్యోతి): ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాయచోటి డైట్ కేంద్రంలో డిసెంబరు 21న నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో సంబేపల్లె విద్యార్థులు రుక్సానా, మౌనిక, తరుణ్ కుమార్‌గౌడ్ ప్రథమ స్థానం పొందినట్లు ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం కడప నాగార్జున డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఏకలవ్య ఫౌండేషన్ వార్షికోత్సవ సభలో విద్యార్థులకు మెమెంటో, మెరిట్ సర్టిఫికెట్ అందించినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన వీరికి కడప ఎంఈఓ గంగిరెడ్డి, నాగార్జున డిగ్రీ కళాశాల డైరెక్టర్ శివ విష్ణుమోహన్‌రెడ్డి, డీఈఓ కార్యాలయం ఏడీ మునీర్‌ఖాన్, పాఠశాల ఏకలవ్య కోఆర్డినేటర్ రెడ్డిశేఖర్, ఏకలవ్య ఫౌండేషన్ సలహాదారులు గునిపాటి శ్రీనివాసులు, ప్రశాంత్ తదితరులు విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

రూ.2000 కోసం చిరు వ్యాపారి హత్య



పులివెందుల టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): అప్పు చెల్లించలేదని తోపుడుబండిపై అరటిపండ్లు అమ్మే వ్యాపారిని హత్య చేశారు. పుల్లారెడ్డి హాస్పిటల్ సమీపంలో నివాసి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం దగ్గర తోపుడుబండిపై అరటిపండ్ల వ్యాపారం చేసుకునే మోహన్ (57) పట్టణానికి చెందిన ఓ అరటికాయల వ్యాపారికి రూ.2వేలు డబ్బు బాకీ ఉన్నాడు. ఆదివారం రాత్రి డబ్బు కావాలని మోహన్‌ను అడగడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో మోహన్‌ను కొట్టడంతో అక్కడే నేలకు ఒరిగి పడిపోయాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించే సమయానికి మృతి చెందాడు. దీనిపై సీఐ వెంకటరవణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి



సింహాద్రిపురం, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లప్పగారి పార్వతమ్మ(80) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సింహాద్రిపురం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ సమాచారం మేరకు.. మృతురాలు పార్వతమ్మ ఇంటికి కొద్ది రోజులుగా ఇంటి బయట తాళం వేసి ఉండేది. ఆమె ఎక్కడికైనా పోయి వుండవ చ్చని స్థానికులు అనుకున్నారు. శనివారం రాత్రి ఇంటి నుంచి దుర్వాసన వెలువడడంతో ఇరుగు పొరుగువారు అనంతపురంలో వున్న మృతురాలు కుమారులకు సమాచారం తెలిపారు. వారు పోలీసుల సమక్షంలో ఇంటి తలుపు తెరవగా పార్వతమ్మ మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. ఆమెను హత్యచేసి వుండవచ్చనే కోణంలో, పలుకోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలు కుమారుడు రామాంజులరెడ్డి ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆదివారం పులివెందుల సీఐ వెంకటరమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలపై సీఐ విచారించారు. అనంతరం డాగ్, క్లూస్ టీమ్‌తో పరిశీలించారు. మృతురాలుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలదు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్థులను విచారిస్తున్న సీఐ వెంకటరమణ

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

లింగాల, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మండంలోని చిన్నకుడాల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వేంపల్లె మండలం బక్కన్నగారిపల్లె గ్రామానికి చెందిన మదన్‌మోహన్, పెద్దక్కలు అనంతపురం జిల్లా నార్పలకు గృహప్రవేశం నిమిత్తం వెళ్లివస్తుండగా చిన్నకుడాలకు చేరుకోగానే, పెద్ద కుడాలగ్రామానికి చెందిన పఠాన్ కమాల్ అనే వ్యక్తి పులివెందుల నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా చిన్నకుడాలకు చేరుకోగానే ప్రమాదవశాత్తు కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.

బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం

ఏపీసీసీ ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో గతంలో జరిగినట్లే ఈసారి కూడా కడప జిల్లాకు, రాయలసీమకు, రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లె లో కాంగ్రెస్ నేతలు నల్లబ్యాడ్జీలు పెట్టుకు ని, నల్లజెండాలతో నిరసన దీక్ష చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో మోదీ ప్రభుత్వ మనుగడ టీడీపీ మీద ఆధారపడి ఉన్నందున, రాష్ట్రానికి తప్పక న్యాయం జరుగుతుందని అందరూ భావించారన్నారు. విభజన చట్టంలోని 13వ షెడ్యూల్ ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణం జరగాలని, కావాల్సిన భూమి, నీరు, విద్యుత్ శక్తి, రవాణా సౌకర్యాలు, ముడిపదార్థాలు జిల్లాలో ఉన్నా నిర్మాణానికి నోచుకోలేదని తెలిపారు. ఈసారి బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేదన్నారు. కడప-రాయచోటి-బెంగుళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గానికి నిధులు మంజూరు, సీమకు, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ ఊసే లేదన్నారు. దీక్షలో కాంగ్రెస్ నేతలు రామాంజనేయరెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, వెంకటేశ్, మహబూబ్‌బాష, రవి, వినయ్, ఐచర్ రమణ, సాయిశ్యామ్, దిలీప్, కిరణ్, విజయ్, పాపయ్య పాల్గొన్నారు.

ఒంటరి మహిళలే టార్గెట్..?!

- బంగారు గొలుసులను లాక్కెళుతున్న దుండగులు
- 100 గ్రాముల బంగారు బొట్టు గొలుసులు స్నాచింగ్
- పట్టపగలే రెచ్చిపోతున్న వైనం


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న మహిళ లక్ష్మీదేవి, బంధువులు (ఫైల్‌ఫొటో)

గుర్రంకొండ, ఫిబ్రవరి2 (ఆంధ్రజ్యోతి): గుర్రం కొండ మండలంలో యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారు. ఈ క్రమంలో గంజాయి, మద్యం మత్తులో నేరాలకు పాల్ప డతూ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకొం టున్నారు. మహిళలు ఒంటరిగా కనబడగానే మెడలో ఉన్న బంగారు బొట్టు గొలుసును తెం చుకొని పరారవుతున్నారు. చైన్ స్నాచింగ్ చేయ డంతో ప్రావీణ్యం ఉన్న యువకులను బయట నుంచి పిలిపించి వారికి పట్టణంలో వివిధ వీధులను కలుపుతూ ఉన్న రోడ్లను గురించి అవగాహన కల్పిస్తున్నట్లు సమాచారం. మెయి న్ బజార్లను వదిలి సీసీ కెమెరాలు లేని వీధు ల్లో తిరిగే ఒంటరి మహిళలనే టార్గెట్ చేస్తూ చైన్ స్నాచింగ్‌తో పరారవుతున్నారు. చోరీ సమ యంలో ముఖానికి పూర్తి స్థాయిలో మాస్క్‌లు వేసుకోవడంతో గుర్తు చిక్కడం లేదని బాధి తులు వాపోతున్నారు. గుర్రంకొండ మండలం లో చైన్ స్నాచింగ్‌ల ముఠా సభ్యులు బస్టాప్ లు, జన సంచారం లేని వీధుల్లో తిరిగే మహిళ లపై రెక్కి నిర్వహిస్తూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పట్ట ణంలోని తాళంవీధి, బజారు వీధి, కొత్తపేట, ఎగువఅమిలేపల్లె క్రాస్, తరిగొండ, మర్రిపాడు గ్రామాల్లో చైన్ స్నాచింగ్ ముఠా సభ్యులు ద్విచక్ర వాహనాల్లో వచ్చి మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కెళ్లిన సంఘటనలు న్నాయి. ఇందుకు కొన్ని సంఘటనల్లోకి వెళితే.. బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉన్న లక్ష్మీదే వి(55) అనే మహిళపై దాడి చేసి మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగు లు పట్టపగలే లాకెళ్లిన సంఘటన గత ఏడాది ఫిబ్రవరి 1న ఎగువఅమిలేపల్లె క్రాస్ వద్ద జరి గింది. ఈ ఘటనలో మహిళ దుండగులను ప్రతిఘటించిన ఆమెను తోసేసి 43 గ్రాముల బరువు గల బంగారు గొలుసును లాకెళ్లారు. వాటి విలువ రూ.2.50 లక్షలు ఉంటుందని బాధితురాలు తెలిపింది. దీంతో బాధితురాలు తనకు జరిగిన అన్యాయాన్ని గుర్రంకొండ పోలీ సులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. మరో ఘటనలో గత ఏడాది ఏప్రిల్ 16వ తేదీనమం డలంలోని అమిలేపల్లె గ్రామానికి చెందిన బి.ఉత్తమ్మ(65) ఇంటి మొదటి అంతస్తులోని బాల్కానిలో నిద్రిస్తుండగా దుండగుడు బాధి తురాలి పక్కఇంటి వైపు నుంచి ఇంటిలోకి ప్రవే శించి మెడలో ఉన్న బంగారు గొలుసును కట్టర్ తో కత్తిరించి పారిపోయాడు. బాధితురాలి గట్టి గా అరవడంతో చుట్టు పక్కల వారు వచ్చేలోపు నిందితుడు పరార్యయాడు. దుండగుడు లాక్కె ళ్లిన బంగారు గొలుసు 30 గ్రాములు ఉంటుం దని ఇది రూ.2 లక్షలు చేస్తుందని బాధితురాలి తెలుపుతుంది. జరిగిన విషయాన్ని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. కా గా 2023 సెప్టెంబరు16వ తేదీ గుర్రంకొండ కొత్తపేటలో డి.రాజమ్మ అనే మహిళ బజారుకు వచ్చి నిత్యవసరాలను కొనుగోలు చేసుకొని ఇం టికి వెళుతుండగా గుర్తు తెలియని దుండగుడు మెడలోని 20 గ్రాముల బంగారు బొట్టు గొలు సును లాకెళ్లాడు. బాధితురాలు గట్టిగా కేకల వేయగా దొంగ పరారయ్యాడు.

చైన్ స్నాచింగ్‌లను అరికడతాం

గుర్రంకొండ పట్టణంలో మహిళల మెడలో ఉన్న బంగారు గొలుసులను గుర్తు తెలియని యువకులు చైన్ స్నాచింగ్ చేసినట్లు తెలిసింది. చైన్ స్నాచింగ్‌లు జరిగిన వీధులు, ప్రాంతాలపై నిఘా ఉంచాం. అలాగే పట్టణంలో కొత్తగా తిరి గే యువకుల వివరాలను సేకరిస్తున్నాం. గు ర్రంకొండ పట్టణం, గ్రామాల్లో ఎలాంటి చైన్ స్నాచింగ్‌లు జరగకుండా సిబ్బందితో పర్యవే క్షిస్తున్నాం. చైన్ స్నాచింగ్ ముఠా సభ్యులను పట్టుకొంటాం.

-మధు రామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ

సీఎంను కలిసిన టీడీపీ నేత శ్రీరాములు



మదనపల్లె, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టీడీపీ సీనియర్ నేత బొమ్మనచెరువు శ్రీరాములు ఆది వారం సీఎం చంద్రబాబునాయుడును కలిశారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం..అక్కడికి చేరుకు న్నారు. ఈ నేపథ్యంలో బొమ్మనచెరువు శ్రీరాములు.. ఢిల్లీలోని సీఎం నివాసం రోడ్‌నంబర్1 జన్‌పథ్‌కు వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థాని క రాజకీయాలపై చర్చించారు.

వైభవంగా గోపురం ప్రతిష్ఠోత్సవాలు


ఆలయ గోపుర కలశాలకు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 2(ఆంధ్ర జ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రస న్న వేంకటరమణ స్వామి ఆల య రాజగోపురం ప్రతిష్ఠ మ హోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇం దులో భాగంగా నాలుగోరోజైన ఆదివారం తెల్లవారుజామునే టీటీడీ వేదపం డితులు స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప, దీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం వేదపండితుల వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ మండపంలో యాగ శాల వైదిక కార్యక్రమాలు చేపట్టి చతుష్టానార్చన హోమం, మధ్యాహ్నం నేత్రోన్మీళనం, చాయాధివాసం నిర్వహించారు. సాయంత్రం ఆలయ గోపుర కళశాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరిం చారు. కార్యక్రమంలో టీటీడీ వేదపండితులు క్రిష్ణప్రసాద్ భట్టర్, క్రిష్ణరాజు, రమేష్, ధనుష్ స్వామి, ఆలయ సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు, పాల్గొన్నారు.

విశ్రాంత హెచ్‌ఎంకు 'మానవత' సన్మానం


సురేంద్ర రావును సన్మానిస్తున్న మానవత సంస్థ సభ్యులు

పీలేరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా వి.కోట మండలం కరిప్పల్లి లోని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఇటీవల పదవీ విరమణ చేసిన పీలేరుకు చెందిన జాదవ్ సురేంద్ర రావును 'మానవత' సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. గడిచిన 37 ఏళ్లుగా సురేంద్రరావు ఉపాధ్యాయుడిగా, ఎంఆర్‌పీగా, హెచ్‌ఎంగా విశిష్ట సేవలు అందించి విద్యా రంగ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు సిద్దరామయ్య, తాతయ్య, రామచంద్ర, రాజేంద్ర, రమేశ్, కృష్ణమూర్తి, వెంకటసుబ్బయ్య, రాహత్ బాషా, సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

కురబలకోటలో కన్నతల్లిపై కొడుకు దాడి

కురబలకోట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి, కని పెంచిన కన్నతల్లిపై కన్న కొడుకు తల్లిపై దాడి చేసిన సంఘటన ఆదివారం మండలం లో జరిగింది. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలం లోని కురబలకోటకు చెందిన రసూల్‌సాబ్ భార్య బావాబి(83)కి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాగా ఆమె ఒంటరి జీవితాన్ని గడపుతూ తన భర్త నుంచి తనకు వచ్చిన భూమిలో జొన్నకర్రలు పండించుకుంటూ ప్రభుత్వ పించన్ సొమ్ముతో జీవనం సాగిస్తోంది. అయితే ఆమె చిన్నకుమా రుడు షామీర్‌బాషా తన తల్లికి తెలియకుండా మొక్కజొన్న పంటను మరొక రికి విక్రయించాడు. దీంతో విషయం ఆమెకు తెలియడంతో తనకు తెలియ కుండా ఎలా అమ్మేశావు, తాను ఎలా బతకాలని కొడుకును ప్రశ్నించింది. దీం తో ఆగ్రహానికి గురైన షామీర్‌బాషా కర్కశంగా దాడి చేసి తల్లిని గాయపరి చాడు. విషయం తెలుసుకున్న పెద్దకుమారుడు ముస్కాన్ అహ్మద్ తల్లిని మదనపల్లె ప్రభుత్వసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు అందించారు.ఈ మేర కు తనకు న్యాయం చేయాలని బాధితురాలు పోలీసులను ఫిర్యాదు చేశారు.

సచివాలయ ఉద్యోగి భర్తపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, రామారావు కాలనీలో సచివాలయ పోలీసు రెడ్డిరోజా(35) మృతిపై ఆమె భర్త పి. లక్ష్మీరవి కుమార్‌పై అనుమానంతో కేసు నమోదు చేసినట్లు ఆదివారం టూటౌన్ సీఐ రామచంద్ర పేర్కొన్నారు. మృతురాలు తండ్రి రెడ్డెప్ప ఫిర్యాదు మేరకు అల్లు డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. శుక్రవారం ఇంటికి వచ్చిన అల్లుడు, కూతురు ఇంటి నుంచి అల్లుడి బంధువులు బారసాల ఉంద ని బయటకు వచ్చి తిరిగి ఇంటికి వచ్చారని, మిద్దెపైన ఏమీ జరిగిందో ఏమో తెలియదు కానీ కొద్దిసేపటి తరువాత అల్లుడు డోర్ గడియ పెట్టి బయటకు వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో అనుమానానికి తావు ఇస్తుం దన్నారు. పోస్టుమార్టంలో మృతదేహంపై గాయాలు ఉన్నట్లు తెలుపుతున్నా రని తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం - నలుగురికి తీవ్ర గాయాలు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. రెండు గ్రామాల ప్రజలపై ఆదివారం దాడి చేయడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు..పెద్దమండ్యం మండలం దట్టి నాయక్ తాండాకు చెందిన దేవలమ్మ(70), క్రిష్టానాయక్ (40), ఇదే మండలం కేతిరెడ్డిపల్లెకు చెందిన జగదీష్(8), నరసమ్మ(50)లపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. గాయపడ్డ బాధితులను కుటుంబసభ్యులు తంబ ళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించడంతో వైద్యులు ప్రధమ చికిత్స అందించా రు. బాధితులకు మెరుగైన వైద్య చికిత్సలు అవసరమవ్వడంతో మదనపల్లె జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు.

అంగళ్లులో మరో భూవివాదం


అంగళ్లు సమీపంలో కడప ప్రధాన రహదారి పక్కనున్న వివాదాస్పద భూమి


వివాదాస్పద స్థలం వద్ద పరస్పరం గొడవ పడుతున్న దృశ్యం

మదనపల్లె, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):కురబలకోట మండ లం అంగళ్లు భూ వివాదాలకు నిలయంగా మారింది. మద నపల్లె పట్టణానికి దగ్గరగా ఉండటం, దానికితోడు అటు అనంతపురం, ఇటు కడప జాతీయ రహదారులు అంగళ్లు గుండా వెళ్తుండటంతో అక్కడి భూముల ధరలకు రెక్కలొ చ్చాయి. దీంతో ఎప్పుడో అమ్మేసిన భూములపై వివాదాలు సృష్టించడం, అదే భూమిని, ప్లాటును మరొకరికి విక్రయా లతో డబుల్ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. గత అయిదేళ్ల వైసీపీ పాలనలో ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి. ఇందులోభాగంగా మొన్న అంగళ్లు సర్వేనంబర్:226, నిన్న అంగళ్లు సర్వేనంబర్:220లలో వివాదాలు, ఘర్షణలు చోటు చేసుకోగా, తాజాగా అంగళ్లు నుంచి ముదివేడు వెళ్లే ప్రధాన మార్గంలోని అంగళ్లు సర్వేనంబర్:236లోనూ ఇలాంటి సం ఘటనే చోటు చేసుకుంది. ఈ భూమి మాదని ఒకరు రం గంలోకి దిగితే, కాదు..మాదంటూ మరొకరు ముందుకెళ్తు న్నారు. ఈ క్రమంలో ఓ వర్గం భూమిని చదును చేసి, రాతి కూసాలతో కంచె వేసి మట్టితోలితే, మరోవర్గం వాటిని తొల గిస్తోంది. దీంతో అక్కడ ఇరువర్గాల మధ్య వాదోపవాదనలు, ఘర్షణ చోటు చేసుకుని ఉద్రిక్తత పరిస్థితికి దారితీస్తోంది. ఈ వ్యవహారం అటు స్థానికులు, ఇటు పోలీసులకు తల నొప్పిగా మారిందని చెబుతున్నారు. ముదివేడు రోడ్డులో వారంరోజులుగా జరుగుతున్న సంఘటన నేపథ్యంలో అంగ ళ్లుకు చెందిన బాధితులు ఎం.పార్వతమ్మ, ఎం.రెడ్డెప్పరెడ్డిలు జిల్లా ఎస్పీ, మదనపల్లె డీఎస్పీ, ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు...తుమ్మచెట్లపల్లెకు చెందిన ఎం.శ్రీనివాసులురెడ్డి నుంచి అంగళ్లు సర్వేనంబర్ 236లో 59సెంట్ల భూమిని 2008లో కొనుగోలు చేశారు. ఈ భూమి విక్రయానికి సంబంధించి శ్రీనివాసులురెడ్డి భార్య ఎం.గీతమ్మ సాక్షి సంతకం చేశారు. అయితే ఇదే భూమిని ఎం.గీతమ్మతోపాటు కుమారులు అదే గ్రామానికి చెందిన పి.రెడ్డెప్ప, పి.శ్రీనివాసులుకు విక్రయించినట్లు బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై న్యాయ స్థానాన్ని ఆశ్రయించగా స్టే ఇచ్చిందన్నారు. అయితే వివాదా స్పద భూమిని చదును చేసి, ఎర్రమట్టితోలి కంచె ఏర్పాటు చేస్తుండగా అడ్డుకోగా, తమపై దాడి చేశారని బాధితులు ఎం.పార్వతమ్మ, ఎం.రెడ్డెప్పరెడ్డిలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. అలాగే ఒకే భూమిని ఇద్దరికి అమ్మి తమకు మోసం చేసిన నిందితులపై చర్యలు తీసు కుని, తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు.

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్ర జ్యోతి):సంతానలక్ష్మీగా పేరు గాంచిన రెడ్డెమ్మకొండ ఆల యంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృ తాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారి ని పరిమళభరిత పుష్పాలతో అలంకరించి అర్చకులు పూజల ను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకో వడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులు కొబ్బరి కాయలు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహ సంక్షేమాధికారికి సన్మానం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):స్థానిక నీరుగట్టువారిపల్లెలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఆది వారం ఆలయకమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉత్తమ వసతి గృహ సంక్షేమాధికారి మం దపల్లె వెంకటేశ్‌ను ఘనంగా సన్మానించారు. తొగట వీరక్షత్రియులు, ఆలయకమిటీ సభ్యులు మందపల్లె వెంకటేశ్‌కు దుశ్శాలువ కప్పి పూలమాలలు వేసి సన్మానించారు. అలాగే బీసీ సంఘాల ఆధ్వర్యంలో మందపల్లె వెంకటేశ్‌కు పూలమాల వేసి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చేతుల మీదు గా వసతి గృహ సంక్షేమాధికారి ఎం.వెంకటేశ్ ప్రశంసా పత్రం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్య క్రమంలో రాష్ట్ర తొగటవీర క్షత్రియ సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, జిల్లా అధ్యక్షుడు భోజనపు వెంకటనారాయణ, ఆలయ కమిటీ సెక్రటరీ బండి పవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఉప్పురామచంద్ర, ట్రెజరర్ రామిశెట్టి రత్నమయ్య, మోడెం సిద్దప్ప, మాజీ కౌన్సిలర్ బండినాగరాజ, రామిశెట్టి నీలకంఠ, లక్ష్మీనా రాయణ, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శీలం రమేస్‌బాబు, బీసీ సంఘం నాయకులు డాక్టర్ ఏఆర్ సురేష్, సుబ్రమణ్యం, రమణ, మౌలాలి, కట్టాగంగుల ప్ప, యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిభిరానికి విశేష స్పందన

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లి గ్రామంలో అమ్మ సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరంలో ఎక్కువగా ఆర్థో, శ్వాసకోశ వ్యాధులు, దగ్గు, జ్వరం, చర్మవ్యాధులు, కంటి సమస్య కలిగిన రోగులు వచ్చారన్నారు. దాదాపు 97మంది రోగులకు చికిత్సచేసి ఉచితంగా మందులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్ర మంలో గ్రామస్థులు శ్రీరాములు, మోహన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1992-93 ఏడాది పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు నేర్పించిన గురు వులు సుభాషిణి, శ్యామలమ్మ, అలివేలమ్మ, అమరావతి, హీరాజీరావు, శ్రీనివాసరావు, ఈశ్వరయ్య, శ్రీనివాసులనాయు డు, రాజారెడ్డి, సుధా, కృష్ణమూర్తి, సూర్యకమారిలకు పాధాభి వందనం చేసి ఘనంగా సన్మానించారు. తాము చదువుకు న్న పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. అనం తరం అందరూ కలిసి గ్రూప్ ఫోటోలు తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు పులి మహాలక్ష్మీ, ఖాసింఖాన్, చంద్రమౌ ళిరెడ్డి, సురేష్, మీనా, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

104 వాహనాన్ని పట్టించుకోండి



వాల్మీకిపురం, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ప్రజలకు వైద్య సేవలందించే 104 సంచార వైద్య వాహ నం చెదలు పట్టే స్థితికి చేరుకుంది. గత వైసీపీ ప్రభుత్వంలో మరమ్మతులకు గురైందో ఏమో కానీ సంవత్సర కాలంగా వాల్మీకిపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఓ మూలన 104 వాహనాన్ని వదిలేశారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ వాహనం సైతం చెదలు పట్టే స్థితికి చేరుకో వడం గమనార్హం. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రన్న 104 సంచార వైద్యం పేరుతో గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలం దించిన వాహనాన్ని ఇలా గాలికి వదిలేయడం సర్వత్రా విమ ర్శలకు తావిస్తోంది. వాహనం లోపలి బాగంలో ఫర్నీచర్ కొన్ని మందులు కూడా చిందరవందరగా పడి ఉన్నాయి. అధికారులు గుర్తించి వాహనానికి మరమ్మతులు చేపట్టి గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించేలా 104 వాహ నాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సారా అమ్మకాలపై చర్యలు తీసుకోండి

గుర్రంకొండ, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని మర్రి మాకులపల్లె, శింగంవారిపల్లెలో నాటు సారా అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, మహిళలు కోరుతున్నారు. గ్రామంలో కొంత కాలంగా నాటు సారా అమ్మకాలు ఎక్కు వగా జరుగుతున్నట్లు చెబుతున్నారు. గ్రామానికి చెందిన కొందరు నాటు సారాను తయారీ చేసి చుట్టు పక్కల ప్రాం తాలకు తరలిస్తున్నారని అధికారులకు తెలిపిన పట్టించు కోవడం లేదని మహిళలు వాపోతున్నారు. అధికారులు సారా అమ్మకాలను అరికట్టాలని మహిళలు కోరుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం

- చంద్రబాబు కృషితో వెయ్యి కోట్లకుపైగా కేటాయింపులు
- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఫిబ్రవరి 2(ఆం ధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రా నికి ప్రాధాన్యత లభించిందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రా రెడ్డి పేర్కొన్నారు. ములకలచెరు వులోని పార్టీ కార్యాలయంలో ఆది వారం జరిగిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ ము ఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో పోలవరం, విశాఖ పోర్టు, స్టీల్ ప్లాంటుతో పాటు రాష్ట్రానికి వెయ్యి కోట్లకుపైగా కేటాయింపులు జరగడం శుభపరిణామన్నారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టడంతో చంద్రబాబు శ్రమ ఫలించిందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థల బలోపేతానికి రూ.162 కోట్లు కేటాయించడంతో పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత కల్పించారన్నారు. ప్రజారంజకమైన బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశ పెట్టిందన్నారు. వికసిత్ బారత్ లక్ష్యాలను చేరుకునేలా బడ్జెట్ ఉందన్నారు. వ్యక్తిగత ఆదాయ పన్నును రూ.12లక్షలకు పెంచడం ద్వారా మధ్యతరగతి వర్గానికి ఎంతో ఉపయోగపడుతుందన్నా రు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆంధ్ర ఊటిగా పేరొందిన హార్సిలీహిల్స్ అభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. గత ఐదేళ్ళ వైసీపీ విధ్వంస పాలన నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్వర్యంలో ఇప్పు డిప్పుడే కోలుకుంటున్న రాష్ట్రానికి ఉతమిచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞ తలు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, కురబలకోట మండ అధ్యక్షుడు వైజీ సురేంద్ర యాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాధరెడ్డి, నాయకులు రమణమూర్తి, రెడ్డెప్ప, శంకర్‌రెడ్డి, ఫజులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు ఉద్యమాల పేరిట జగన్ నాటకం


సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేశ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఫీజు ఉద్యమాల పేరిట వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త నాటకానికి తెర లేపుతున్నారని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్పురి రమేశ్ దుయ్యబట్టారు. ఆదివారం మదనపల్లెలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రూ.2వేల కోట్లు ఫీజు బకాయిలు పెట్టి వెళ్లిపోయిన జగన్, విద్యార్థుల జీవితా లను నాశనం చేశాడన్నారు. అలాంటి వైసీపీ నాయకులు ఇప్పుడు ధర్నాలు చేస్తామ నడం సిగ్గుచేటన్నారు. టీడీపీ పాలనలో 16లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే , వైసీపీ ప్రభుత్వం 9 లక్షల మందికే ఇచ్చిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎని మిది నెలల్లోనే రూ.788కోట్లు విడుదల చేసి 10లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు వచ్చేలా చేసిందన్నారు. ఈ ఘనత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుంద న్నారు. ఈనెల 5వ తేదీ వైసీపీ నాయకుల ధర్నాను విద్యార్థులే తిప్పికొడతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ విభాగం జిల్లా కార్యదర్శి రెడ్డిశేఖర్, టీఎన్ఎస్ఎఫ్ రాజేష్, రెడ్డిప్రసాద్, గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులు దేశరక్షణకు పాటుపడాలి


ప్రముఖపర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో ట్రెక్కింగ్ నిర్వహిస్తున్న మిట్స్ విద్యార్థులు

కురబలకోట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ విద్యార్థులు దేశరక్షణకు పాటుపడాలని ప్రిన్సిపాల్ సి.యువరాజ్ , ఎన్‌సీసీ లెఫ్టినెంట్ నవీన్‌కుమార్‌లు పేర్కొన్నారు. మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రముఖపర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు ట్రెక్కింగ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించగా 100మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలను చేపట్టడంతో పాటుగా దేశ రక్షణకు అత్యవసర సమయాల్లో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోప్ హ్యాండ్లింగ్, హిల్ క్లైబింగ్ తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. అనంతరం బీసీ సర్టిఫికెట్లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హవల్దార్‌లు నందన్‌రామ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

గణిత ఉపాధ్యాయుడికి పురస్కారం


ఉపాధ్యాయుడు చలపతికి పురస్కారం అందజేసి సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యో తి): మదనపల్లె జడ్పీహైస్కూల్లో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న వొంటి కొండ చలపతినాయుడుకు తెలుగు వెలు గు సాహితి వేదిక జాతీయ పురస్కా రాన్ని అందజేవారు. ఆదివారం విజయ వాడలోని తుమ్మలపల్లె కళాక్షేత్రంలో స్వా మి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలం దించిన ప్రముఖులకు తెలుగు వెలుగు సాహితి వేదిక పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా గణిత ఉపాధ్యాయుడుగా సులువైన పద్ధతిలో విద్యార్థులకు అర్థమ య్యేలా బోధనలు అందించిన చలపతినాయుడుకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు, టీడీపీ రైతు విభాగం నాయకుడు వి.వెంకటేశ్ పురస్కార గ్రహీతకు శుభాకాంక్షలు తెలిపారు.

స్వగ్రామాల్లో సేవా కార్యక్రమాల ద్వారా సంతృప్తి


శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ ఉపేంద్ర రెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): స్వగ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా అంతులేని సంతృప్తి కలుగుతుందని ఎన్ఆర్ఐ ఉపేంద్ర రెడ్డి తెలిపారు. కేవీపల్లె మండలం మిన్నమరెడ్డిగారిపల్లెకు చెందిన ఆయ న తన స్నేహితుడు వంగిమళ్ల శ్రీనివా సులురెడ్డి చెన్నైలోని శంకర నేత్రాలయ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మిన్నమరెడ్డిగారిపల్లెలో ఆదివారం ఉచిత కంటి పొర శస్త్రచి కిత్సల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణులు కంటి శస్త్ర చికిత్సలకు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండడంతో నేటికీ చాలా మంది కంటి చూపు కోల్పోతున్నారన్నారు. దీంతో తాము గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి శస్త్ర చికిత్సలను అందించాలన్న లక్ష్యంతో శంకర నేత్రాలయ ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మిన్నమరెడ్డిగారిపల్లెలో వారం రోజులపాటు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి మిన్నమరెడ్డిగారిపల్లెలోనే అధునాతనమైన మొబైలు ఆప రేషన్ థియేటర్‌లో చేస్తారన్నారు. అనంతరం శిబిరానికి హాజరైన వారికి ప్రాథమిక పరీక్ష లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు పొత్తపు సతీశ్ రెడ్డి, సిద్దారె డ్డి, సుబ్బారెడ్డి, కోలా కృష్ణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కురబలకోటలో దివ్యాంగుడిపై దాడి

కురబలకోట, ఫిబ్రవరి 2(ఆంధ్రజ్యోతి): కురబలకోటలో దివ్యాంగుడిపై దాడిపై చేసిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండ లంలోని కురబలకోటకు చెందిన దివ్యాంగుడు రసూల్(72)జిరాక్స్ దుకాణాన్ని నిర్వహిం చుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా కనసానివారిపల్లె పంచాయతీ దిగుబోయప ల్లెకి చెందిన కొంతమంది వ్యక్తులు దుకాణం వద్ద గొడవపడుతున్నారు. అయితే అక్కడి నుంచి వెళ్లిపోవాలని షాపు నిర్వాహకుడు చెప్పడంతోవారి మధ్య వాగ్వాదాలు జరగడం తో ఆవేశానికి గురైన ఒక యువకుడు ఆయనపై దాడి చేసి గాయపరిచారు. దీంతో గ్రామానికి చెందిన కొంతమంది కురబలకోట బస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడిని ముదివేడు పోలీసులు విచారిస్తున్నారు.